News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 02 | సంచిక :326 | ఖమ్మం | గురువారం జనవరి 9, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad


# మంత్రులంతా ప్రజల్లోకి వెళ్లాలి

- నామినేటెడ్ పదవులన్నీ వెంటనే భర్తీ చేయాలి
- ప్రతి జిల్లాలో నెలకోసారి మంత్రులు ప్రజాదర్బార్ నిర్వహించాలి
- కష్టపడి పనిచేసే కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి
- పీఏసీ సమావేశంలో కేసీ వేణుగోపాల్ నిర్దేశం



మంత్రులంతా ప్రజల్లోకి వెళ్లాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచించారు. కొందరు క్షేత్రస్థాయిలో విస్తృతంగా తిరగడం లేదని పీఏసీ సమావేశంలో ఆయన చెప్పినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున సంక్షేమ కార్యక్రమాలను, పథకాలను అమలు చేస్తున్నా వాటి గురించి ప్రజలకు వివరించి ఎందుకు చెప్పలేకపోతున్నారని ఆయన గట్టిగా ప్రశ్నించినట్లు తెలిసింది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. మంత్రులు గ్రామాల్లో తిరుగుతూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలని బుధవారం గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ(పీఏసీ) సమావేశంలో ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఏడాది పాలన బాగుందని, కానీ ఇంకా మెరుగ్గా పనిచేయాలని చెప్పారు. పార్టీ నేతల పనితీరును విశ్లేషించిన ఆయన.. కొందర్ని సున్నితంగా హెచ్చరించినట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహించాలని.. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని సూచించారు. ప్రతి జిల్లాలో నెలకోసారి ప్రజాదర్బార్‌ను మంత్రులు నిర్వహించి.. ప్రజల సమస్యలను తెలుసుకోవాలని చెప్పినట్లు సమాచారం. అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై నిరసన ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. పార్టీలో గ్రామస్థాయి

వివరాలు 2లో..



- చూడొచ్చు.. వినొద్దు

# నో పర్మిషన్!

## కేటీఆర్‌తో కలిసి లాయర్ కూర్చోవద్దు

## ఆ టైంలో కనపడేలా ఉంటే చాలు

ఎంక్వైరీ రూంలో ఆఫీసర్, కేటీఆరే ఉండాలె
న్యాయవాది రాంచందర్ రావు
లైబ్రరీలో కూర్చొని కిటికీలోంచి చూడొచ్చు
ఫార్ములా ఈ కేసులో హైకోర్టు తీర్పు

వివరాలు 2లో..

### నేడు అనిశా ముందుకు కేటీఆర్

ఫార్ములా-ఈ కేసు దర్యాప్తులో భాగంగా మాజీ మంత్రి కేటీఆర్ గురువారం అనిశా ఎదుట హాజరుకానున్నారు. వాస్తవానికి సోమవారం అనిశా కార్యాలయానికి వచ్చిన ఆయన తన న్యాయవాదులను అనుమతించడంలేదన్న కారణంగా వెనక్కు వెళ్లిపోయారు. ఒక లేఖను దర్యాప్తు అధికారికి అందజేశారు. తన నుంచి ఎలాంటి పత్రాలు కావాలో స్పష్టంగా చెప్పి తగిన సమయం ఇస్తే వాటిని అందజేస్తానని ఆ లేఖలో పేర్కొన్నారు. దాంతో అదే రోజు అనిశా అధికారులు మరోమారు నోటీసు జారీ చేశారు. గురువారం దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని పేర్కొన్నారు. ఎలాంటి పత్రాలు కావాలన్న విషయం విచారణ తర్వాత తెలుస్తుందని, అప్పుడు తగిన సమయం ఇస్తామని అందులో పేర్కొన్నారు. ఈ కేసులో ఎంఏయూడీ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ గురువారం ఈడీ విచారణకు హాజరుకానున్నారు.

# మాకేమీ సంబంధం లేదు

- ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే నడుచుకున్నాం
- ఫార్ములా-ఈ రేసు కేసు విచారణలో దర్యాప్తు సంస్థలకు తెలిపిన అర్వింద్, బీఎల్ఎన్ రెడ్డి



సంచలనం రేపుతున్న ఫార్ములా-ఈ రేసు కేసులో వేర్వేరు దర్యాప్తు సంస్థల ఎదుట హాజరైన నిందితులు ఇద్దరూ తాము ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే నడుచుకున్నామని చెప్పినట్లు తెలుస్తోంది. ఇందులో తమ పాత్ర ఏమీలేదని, నిబంధనల ఉల్లంఘన కూడా జరగలేదని

వివరాలు 2లో..

# నాపై ఉన్న కేసు గురించి ఎవరూ ఆందోళన చెందవద్దు



- కేసీఆర్ పార్టీ పెట్టినప్పటి ఇబ్బందులతో పోలిస్తే ఇవి లెక్క కాదన్న కేటీఆర్
- తనపై నమోదైనది ఓ లొట్ట పీసు కేసు అని వ్యాఖ్య
- రైతు భరోసాపై రేవంత్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు చెప్పాలని పిలుపు

వివరాలు 2లో..

## ఈ నెలాఖరు నుంచి ప్రజల్లోనే...

# జగన్ కీలక నిర్ణయం

- నెల్లూరు జిల్లా వైసీపీ నేతలతో జగన్ సమావేశం
- రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని విమర్శలు
- చంద్రబాబు దుర్మార్గపు పాలనలో మనం ప్రజలకు అండగా ఉండాలని పిలుపు
- జనవరి నెలాఖరు లేదా ఫిబ్రవరి నుంచి జిల్లాల పర్యటనకు వస్తానని వెల్లడి

వివరాలు 2లో..



# మందు ప్రియులకు షాక్

# కింగ్ ఫిషర్ బీర్లకు బ్రేక్

## తెలంగాణకు ఆ కంపెనీ ఏడు రకాల బీర్ల సరఫరా నిలిపివేత

- ఐదేళ్లుగా బీర్ల ధరలు పెంచకపోవడంతో నష్టాలు వస్తున్నాయన్న కంపెనీ
- తెలంగాణ ఎక్సైజ్ కమిషనర్‌ను కలిసిన యూబీఎల్ ప్రతినిధులు
- తక్షణమే 'నిలిపివేత' నిర్ణయం అమల్లోకి వస్తుందని లేఖ అందజేత

తెలంగాణ రాష్ట్రంలో మందు ప్రియులకు షాక్.. ఊహించని ఎదురుదెబ్బ.. మందు ప్రియులు.. అందులోనూ బీరు ప్రియులకు ఎంతో ఇష్టమైన కింగ్ ఫిషర్ బీర్ల సరఫరాను నిలిపివేసింది ఆ కంపెనీ. ఇక నుంచి తెలంగాణలో కింగ్ ఫిషర్ బీర్ల సరఫరా చేయలేం అని స్పష్టం చేసింది. కింగ్ ఫిషర్ బీర్ ప్రియులకు బిగ్ షాక్ తగలనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణా బేవరేజెస్ కార్పొరేషన్‌కు బీర్ల సప్లై ఆపేస్తున్నట్లుగా కింగ్ ఫిషర్ బీర్ కంపెనీ ప్రకటించినట్లుగా సమాచారం. పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు బీర్ల ధరలు కూడా పెంచాలని డిమాండ్ చేస్తూ కింగ్ ఫిషర్ కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది వేసవి కాలంలోనూ కింగ్ ఫిషర్ బీర్లు సరిగా సప్లై చేయకపోవడంతో మద్యం షాపుల్లో నో స్టాక్ అంటూ

వివరాలు 2లో..




# ఇక ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉండవు...

## ఏపీ సర్కార్ సంచలన నిర్ణయం



- ఇంటర్ పరీక్షల నిర్వహణలో సంస్కరణలు తీసుకొచ్చిన ఏపీ ప్రభుత్వం
- ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలను మాత్రమే బోర్డు నిర్వహిస్తుందని వెల్లడి
- సీబీఎస్ఈ విధానంతో ముందుకు సాగుతామన్న ప్రభుత్వం

వివరాలు 2లో..

# ఏప్రిల్ తర్వాత కొత్త నోటిఫికేషన్లు..

## అతి త్వరలో గ్రూప్ -1, 2, 3 ఫలితాలు




హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) చైర్మన్ బుర్రా వెంకటేశం కీలక వ్యాఖ్యలు చేశారు. టీజీపీఎస్సీ ద్వారా భర్తీ చేసే ఉద్యోగాల నోటిఫికేషన్లు 2025 ఏప్రిల్ తర్వాతనే జారీ చేస్తామని స్పష్టం చేశారు. 2025,

వివరాలు 2లో..

# తిరుపతిలో పెనువిషాదం

## తొక్కిసలాటలో ఐదుగురు భక్తుల మృతి

- వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కోసం తోపులాట
- అస్వస్థతతో మరో మహిళ మృతి

తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో ఐదుగురు భక్తులు మరణించారు. మరో 48 మంది క్షతగాత్రులు తిరుపతిలోని రుయా, స్విమ్స్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల్లో నలుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. వీరిని నర్సీపట్నానికి చెందిన బుద్దేటి నాయుడుబాబు (51), విశాఖపట్నానికి చెందిన రజిని (47), లావణ్య (40), శాంతి (34), కర్ణాటకలోని బళ్లారికి చెందిన నిర్మల (50)లుగా గుర్తించారు. అంతకుముందే శ్రీనివాసం వద్ద ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద అస్వస్థతకు గురై తమిళనాడులోని సేలం ప్రాంతానికి చెందిన మల్లిగ (49) అనే మహిళ మృతి చెందినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

వివరాలు 2లో..



# నో పర్మిషన్.. కేటీఆర్ తో కలిసి లాయర్ కూర్చోవద్దు

ఫార్ములా-ఈ రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసు విచారణ సమయంలో తన వెంట న్యాయవాదిని తీసుకెళ్లేందుకు మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టు అనుమతించింది. ప్రశ్నిస్తున్న గదిలోకి మాత్రం ఆయనకు అనుమతి ఉండదని స్పష్టం చేసింది. విచారణను కనిపించేంత దూరం నుంచి గమనించవచ్చంది. విచారణలో న్యాయవాది కేటీఆర్‌కు ఎలాంటి సహకారం అందించరాదని, జోక్యం చేసుకోరాదని తేల్చిచెప్పింది. ఏసీబీ కేసు విషయంలో దర్యాప్తునకు సహకరించడానికి సిద్ధంగా ఉన్నానని, న్యాయవాదిని తీసుకెళ్లేందుకు అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ కేటీఆర్ బుధవారం దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రభాకర్‌రావు వాదనలు వినిపించారు. దర్యాప్తు అధికారి విచారణ సందర్భంగా న్యాయవాదిని అనుమతిస్తూ సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. దర్యాప్తు అధికారి కేటీఆర్‌ను విచారిస్తుండగా... ఆయన న్యాయవాది చూడటానికి అనువైన ఏర్పాట్లు ఉన్నాయో లేదో చెప్పాలని అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డిని ఆదేశిస్తూ న్యాయమూర్తి విచారణను 4 గంటలకు వాయిదా వేశారు. న్యాయవాది లైబ్రరీలో కూర్చుంటే విచారణ కనిపిస్తుందని ఏఏజీ సాయంత్రం న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. కానీ న్యాయవాదిని అనుమతించరాదని కోరారు. న్యాయవాది మరో గదిలో ఉండి చూస్తూ ఉంటే ఇబ్బంది ఏమిటని జస్టిస్ కె.లక్ష్మణ్ ప్రశ్నించారు.

**ఆడియో, వీడియో రికార్డింగ్ అభ్యర్థనకు తిరస్కరణ**

దర్యాప్తు అధికారి విచారణ ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేసేలా ఆదేశించాలని కేటీఆర్ న్యాయవాది కోరారు. న్యాయవాది సమక్షంలో విచారణా... లేక ఆడియో, వీడియో రికార్డింగా- ఈ రెండింటిలో ఏదో ఒకదానికే అనుమతిస్తామని న్యాయమూర్తి స్పష్టం చేశారు. గతంలో అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో రెండింటికీ అనుమతించారని న్యాయవాది గుర్తు చేశారు. ఆ కేసుతో ఇక్కడ పోలిక లేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. "సీబీఐ నమోదు చేసిన కేసులో ఆ దర్యాప్తు సంస్థ అధికారిపై అవినాశ్‌రెడ్డి ఆరోపణలు చేశారు. స్టేట్‌మెంట్‌లో కొన్ని తొలగించారని, మరికొన్ని చేర్చారనడంతో ఆమేరకు ఉత్తర్వులు జారీ చేశాం" అని స్పష్టం చేశారు. కేటీఆర్ వెంట న్యాయవాది వెళ్లవచ్చని, అయితే విచారణ గదిలో కాకుండా మరోచోట కూర్చుని ప్రశ్నించే ప్రక్రియను గమనించవచ్చన్నారు. కేటీఆర్ స్టేట్‌మెంట్ రికార్డు సమయంలోగానీ, దర్యాప్తు అధికారి ప్రశ్నిస్తున్నప్పుడుగానీ న్యాయవాది జోక్యం చేసుకోరాదన్నారు.

**అనుమానాలుంటే మళ్లీ రావొచ్చు...**

న్యాయవాదితో కలిసి గురువారం ఏసీబీ విచారణకు వెళ్లాలని కేటీఆర్‌కు న్యాయమూర్తి సూచించారు. విచారణ తర్వాత ఏవైనా అనుమానాలుంటే మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉందన్నారు. ఏసీబీ విచారణకు కేటీఆర్‌తోపాటు వెళ్లేందుకు ముగ్గురు న్యాయవాదుల పేర్లను సూచించాలని.. అందులో ఒకరిని అనుమతిస్తామని చెప్పారు. దర్యాప్తు అధికారి, కేటీఆర్ ఓ గదిలో ఉంటే.. వాళ్లిద్దరూ కనిపించేంత దూరంలో న్యాయవాది ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఏసీబీని ఆదేశించారు.

# మంత్రులంతా ప్రజల్లోకి వెళ్లాలి

- మొదటి పేజి తరువాయి

నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని కమిటీల నియామకాలు పూర్తి చేసి.. పార్టీ సంస్థాగత సంవత్సరంగా 2025ను జరుపుకోవాలన్నారు. పీఏసీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి.. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలను, పార్టీ పనితీరును సమీక్షించుకోవాలన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ఈ కమిటీయే అత్యున్నత స్థాయిదని ఆయన చెప్పారు. ఈ కమిటీలో కొత్త సభ్యులను నియమించేవరకూ ప్రస్తుతము న్నవారే కొనసాగాలని సూచించారు. సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ప్రియాంకా గాంధీపై భాజపా నాయకుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసనలు చేపట్టామని చెప్పారు.

**ప్రజలకు చెప్పడంలో వెనకబడుతున్నాం**

కమిటీ సభ్యులు రాష్ట్రంలో పార్టీ, ప్రభుత్వ పనితీరుపై తమ అభిప్రాయాలు తెలిపినట్లు సమాచారం. ప్రభుత్వ పనితీరు బాగుందని.. కానీ, చేసిన పనులను ప్రజలకు వివరించి చెప్పడంలో వెనకబడుతున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కోరినట్లు సమాచారం. పీసీసీ కార్యవర్గాన్ని కొత్తవారితో త్వరగా ఏర్పాటు చేయాలని పలువురు కోరినట్లు సమాచారం.

# ఏప్రిల్ తర్వాత కొత్త నోటిఫికేషన్లు..

- మొదటి పేజి తరువాయి

మార్చి 31లోపు పెండింగ్ లో ఉన్న నోటిఫికేషన్ల ఫలితాలు ఇచ్చేస్తామని తెలిపారు. ఏ పరీక్ష ఫలితాలు కంప్లీట్ అయితే అవి వెంటనే ఇచ్చేస్తామన్నారు. గతంలో మాదిరిగా రిజల్ట్ విడుదలలో జాప్యం చేయకుండా త్వరగా ఫలితాలు ఇవ్వాలనే ఉద్దేశంతో ఉన్నామని పేర్కొన్నారు. వచ్చే వారం పదిరోజుల తేడాతో గ్రూప్ -1, 2, 3 ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించారు. టీజీపీఎస్సీ సిలబస్ పై కూడా స్టడీ చేస్తున్నామని.. గ్రూప్ -3కి మూడు నాలుగు పేపర్లు అవసరం లేదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. యూపీఎస్సీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఫార్మెట్లో వెళ్లాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. యూపీఎస్సీ ప్రతి ఏటా 5 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తుంది. టీజీపీఎస్సీలో ఉద్యోగాలను బట్టి కొన్ని కంప్యూటర్ బేస్డ్, మరికొన్ని మ్యానువల్ ఎగ్జామ్స్ పెట్టాలని ఆలోచన చేస్తున్నామని వివరించారు. ఇక నుండి క్వశన్ పేపర్ విధానం మారుస్తామని.. ముందుగా క్వశన్ బ్యాంకు తయారు చేసి దాని నుండి క్వశన్ పేపర్లు సిద్ధం చేస్తానమి తెలిపారు. ఒక్కొక్క సబ్జెక్టులో 5 నుండి 10 వేల వరకు బిట్స్ తీసుకొని ప్రిపేర్ చేస్తామన్నారు. మార్చి 31 లోపల వేకెన్సీ లిస్ట్ సర్కార్ నుండి రావాలి. ఏప్రిల్ లో భర్తీపై కసరత్తు చేసి.. మే 1నుండి నోటిఫికేషన్లు విడుదల చేస్తామని క్లారిటీ ఇచ్చారు. వెకెన్సీ లిస్ట్ కోసం ప్రభుత్వానికి లేఖ రాస్తామని చెప్పారు. ఇక నుండి ఇంటర్వ్యూ ఉండే పోస్టులను సంవత్సరంలో.. ఇంటర్వ్యూ లేని వాటిని 6 నుండి 8 నెలల్లో ప్రాసెస్ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగులు టీజీపీఎస్సీపై అపనమ్మకం, అపోహలు వీడాలని.. నిరుద్యోగులకు టీజీపీఎస్సీపై నమ్మకం కలిగేలా పనిచేస్తున్నామన్నారు.

# తిరుపతిలో పెనువిషాదం

- మొదటి పేజి తరువాయి

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కోసం.. తిరుపతిలో 8 కేంద్రాల వద్ద స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్ల జారీకి తితిదే అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 10, 11, 12 తేదీలకు సంబంధించి మొత్తం 1.20 లక్షల టోకెన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించారు. 9వ తేదీ (గురువారం) ఉదయం 5 గంటలకు టోకెన్ల జారీ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దీంతో బుధవారం ఉదయం నుంచే రాష్ట్రంతోపాటు పొరుగునున్న తమిళనాడు, తెలంగాణ, కర్ణాటకల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. బుధవారం సాయంత్రానికి భారీ సంఖ్యలో పోగయ్యారు. మొత్తం నాలుగు ప్రాంతాల్లో (జీవకోన, బైరాగిపట్టెడ, శ్రీనివాసం, అలిపిరి) తొక్కిసలాట జరిగింది. తొలుత జీవకోన వద్ద ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. రాత్రి ఏడు గంటల సమయంలో భక్తులు ఒక్కసారిగా క్యూలైన్లలోకి ప్రవేశించబోయారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా తోసుకుంటూ లోపలికి వెళ్లే క్రమంలో తోపులాట జరిగింది. ఎస్పీ సుబ్బారాయుడు అక్కడికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

**బైరాగిపట్టెడ వద్ద దుర్ఘటన**

జీవకోన వద్ద పరిస్థితి అదుపులోకి వచ్చిందని భావిస్తుండగానే ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో కేంద్రం వద్దకు భక్తులు చేరుకోవడంతో అధికారులు వారిని పక్కనే ఉన్న శ్రీపద్మావతి పార్కులోకి అనుమతించారు. రాత్రి 8.15 గంటల సమయంలో పార్కులో ఉన్న ఒక వ్యక్తి అస్వస్థతకు గురవడంతో ఆయనకు వైద్యం అందించేందుకు అధికారులు గేట్లు తెరవబోయారు. క్యూలైన్లలోకి వదిలేందుకే గేట్లు తెరుస్తున్నారని భావించిన కొందరు ఒక్కసారిగా దాన్ని బలంగా తోసుకుని ముందుకెళ్లే ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో భక్తులు తోసుకుంటూ రావడంతో చాలామంది కిందపడిపోయారు. ఊపిరాడక పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పోలీసులు క్షతగాత్రులను అంబులెన్సుల్లో రుయా, స్విమ్స్ ఆసుపత్రులకు తరలించారు. ఆసుపత్రికి వెళ్లే సమయానికే నలుగురు మృతి చెందినట్లు వైద్య అధికారులు పేర్కొన్నారు. బైరాగిపట్టెడ వద్ద జరిగిన ఘటనలోనే ఆరుగురు చనిపోవడం గమనార్హం. విషయం తెలిసిన వెంటనే తితిదే ఈఓ శ్యామలరావు, జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, ఎస్పీ సుబ్బారాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఘటనాస్థలానికి చేరుకుని సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

**అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్‌లో తొక్కిసలాట**

**40 మందికి గాయాలు**

తొక్కిసలాటలో మరో 40 మంది భక్తులకు గాయాలయ్యాయి. వారికి రుయా, స్విమ్స్ ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. ఆసుపత్రుల వద్ద అంబులెన్సుల మోత, క్షతగాత్రుల బంధువుల రోదనలతో రుయా ఆసుపత్రి ప్రాంగణం వద్ద దయనీయ పరిస్థితి నెలకొంది. ఆసుపత్రికి తీసుకువచ్చి చికిత్స అందించే సమయంలో క్షతగాత్రుల హాహాకారాలను విని, అక్కడున్న వారంతా చలించిపోయారు. తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జేసీ శుభం భన్సల్, ఆర్డీవో రామమోహన్ ఆసుపత్రిలోనే ఉండి క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించేలా పర్యవేక్షిస్తున్నారు. ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు అందరినీ హుటాహుటిన రప్పించారు.

**పార్కులోకి వదలడం వల్లే..**

గతంలో బారికేడ్లను ఏర్పాటు చేసి, అక్కడ పరిస్థితిని అనుసరించి భక్తులను క్యూలైన్లలోకి వదిలేవారు. ఎన్నడూ లేని విధంగా బైరాగిపట్టెడ టోకెన్ల కేంద్రం వద్ద ఉన్న పార్కులోకి భక్తులను అనుమతించారు. మధ్యాహ్నం నుంచి అక్కడే కూర్చుని ఉండటంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. పార్కులో ఎక్కువ మంది ఉండటం.. వారంతా ఒక్కసారిగా వెలుపలికి వచ్చేందుకు గేటును తోయడంతో కిందపడిపోయారు. అదే తొక్కిసలాటకు దారితీసింది.

**సీసీ కెమెరాల పరిశీలన**

తోపులాటకు దారితీసిన కారణాలపై తితిదే అధికారులు భక్తుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. కొందరు భక్తులు అనవసరంగా తోయడమే తొక్కిసలాటకు కారణమయిందా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించి ఘటనకు దారితీసిన పరిణామాలపై సమగ్ర నివేదిక తయారు చేయాలని భావిస్తున్నారు. హుటాహుటిన తిరుపతికి మంత్రులు క్షతగాత్రులకు సహాయ చర్యలు, వైద్యసేవలను పర్యవేక్షించేందుకు మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్‌ల బృందం తిరుపతికి బయల్దేరింది. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తితిదే ఉన్నతాధికారులతో మాట్లాడారు.

**తిరుపతి కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్**

తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో క్షతగాత్రుల వివరాలు, ఇతర సమాచారం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 0877-2236007 నంబరును సంప్రదించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

**భక్తులు భారీగా వస్తారని తెలిసీ.. ఎందుకు ఏర్పాట్లు చేయలేదు?**

**అధికారులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం**

వైకుంఠద్వార దర్శనం టోకెన్ల కోసం పెద్ద సంఖ్యలో భక్తులొస్తారని తెలిసీ.. అందుకు తగ్గట్లు ఎందుకు ఏర్పాట్లు చేయలేదని అధికారులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత లేదా అని నిలదీశారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై డీజీపీ, తితిదే ఈవో, తిరుపతి కలెక్టర్, ఎస్పీలతో బుధవారం ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందు జాగ్రత్త చర్యల్లో విఫలమైన అధికారులపై తీవ్ర అసంతృప్తి ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, టోకెన్లు ఇచ్చే కౌంటర్ల నిర్వహణ, భద్రతను పునస్సమీక్షించాలని ఆదేశించారు. విశాఖపట్నంలో మంచి కార్యక్రమం పూర్తి చేసుకున్న సమయంలోనే ఇలాంటి విచారకర ఘటన జరగడం తీవ్రంగా బాధించిందన్నారు. క్షతగాత్రుల్ని పరామర్శించేందుకు గురువారం చంద్రబాబు తిరుపతి వెళ్లనున్నారు. ఘటన సమాచారం తెలిసినప్పటి నుంచి ఆయన తిరుపతి జిల్లా ఉన్నతాధికారులు, తితిదే అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఘటనాస్థలికి వెళ్లి క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారుల్ని ఆదేశించారు.

## ఈ నెలాఖరు నుంచి ప్రజల్లోనే... జగన్ కీలక నిర్ణయం

వైసీపీ అధినేత జగన్ ఇవాళ తాడేపల్లిలో నెల్లూరు జిల్లా వైసీపీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని, చంద్రబాబు దుర్మార్గపు పరిపాలన వల్ల మనం ప్రజలకు తోడుగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

మన పాలనలో అన్నీ ఇంటివద్దనే డోర్ డెలివరీ చేశాం... కానీ ఇప్పుడు ప్రజలు టీడీపీ నాయకుల వద్దకు తిరగాల్సిన పరిస్థితి వచ్చిందని జగన్ వ్యాఖ్యానించారు. ఇలాంటి సమయంలో మనమంతా ప్రజలకు అండగా నిలవాలని నేతలకు కర్తవ్యబోధ చేశారు.

తాను కూడా ప్రజల్లోకి వస్తానని జగన్ వెల్లడించారు. జనవరి నెలాఖరు నుంచి లేదా ఫిబ్రవరి నుంచి జిల్లాల పర్యటనకు వస్తానని ప్రకటించారు. ప్రతి వారంలో 3 రోజులు ఒక పార్లమెంటు స్థానంలో మకాం వేస్తానని, ప్రతి రోజు రెండు అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తలతో సమావేశమవుతానని వెల్లడించారు. బూత్ స్థాయి నుంచి ప్రతి కమిటీ బలోపేతం కావాలని, సోషల్ మీడియాను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇవాళ మనం కేవలం చంద్రబాబుతోనే యుద్ధం చేయడంలేదు, కుళ్లిపోయిన మీడియాతోనూ యుద్ధం చేస్తున్నాం అని వ్యాఖ్యానించారు. అందుకే పార్టీలో ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా ప్రాధాన్యత గుర్తించాలని జగన్ స్పష్టం చేశారు.

## ఇక ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉండవు... ఏపీ సర్కార్ సంచలన నిర్ణయం

ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఏపీ ప్రభుత్వం సంస్కరణలను తీసుకొచ్చింది. వచ్చే ఏడాది నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉండవని వెల్లడించింది. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఇంటర్ విద్యామండలి కార్యదర్శి కృతికా శుక్లా తెలిపారు. జాతీయ కరికులం చట్టాన్ని అనుసరించి సంస్కరణలు చేపట్టినట్టు వెల్లడించారు. సైన్స్, ఆర్ట్స్, లాంగ్వేజెస్ సబ్జెక్టుల్లో సంస్కరణలు అమలు చేస్తామని కృతికా శుక్లా తెలిపారు. రానున్న విద్యా సంవత్సరం (2025-26) నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో ఎన్సీఈఆర్టీ పుస్తకాలను పెడుతున్నామని... దీనివల్ల నీట్, జేఈఈ వంటి జాతీయ పోటీ పరీక్షలకు సులభతరం అవుతుందని చెప్పారు. సీబీఎస్ఈ విధానంతో ముందుకు సాగుతామని అన్నారు.సంస్కరణల్లో భాగంగానే ఇంటర్ ఫస్టియర్ పబ్లిక్ పరీక్షలను తొలగించామని తెలిపారు. తొలి సంవత్సరం పరీక్షలను ఆయా కాలేజీలే అంతర్గతంగా నిర్వహిస్తాయని... ఇంటర్ సెకండియర్ పరీక్షలను మాత్రం ఇంటర్ బోర్డు నిర్వహిస్తుందని చెప్పారు. సంస్కరణలపై ఈ నెల 26 లోగా సలహాలు, సూచనలు పంపవచ్చని తెలిపారు.

## మాకేమీ సంబంధం లేదు

- మొదటి పేజి తరువాయి

స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నాటి ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, హెచ్ఎండీఏ పూర్వ కమిషనర్ అర్వింద్‌కుమార్‌ను అనిశాబీ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం ప్రశ్నించారు. వారిద్దరి వాంగ్మూలాలు నమోదు చేశారు.స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్స్ట్‌జెన్ సంస్థ అర్ధాంతరంగా వైదొలగడం దగ్గర నుంచి ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో)కు హడావుడిగా నిధులు బదిలీ చేయడం వరకూ జరిగిన అనేక అంశాలపై అర్వింద్‌కుమార్ నుంచి అనిశా అధికారులు సమాధానాలు రాబట్టారు. ఉదయం 10 గంటల సమయంలో అనిశా కార్యాలయంలోకి వెళ్లిన ఆయనను మధ్యలో భోజన విరామం మినహా సాయంత్రం 4 గంటల వరకూ ప్రశ్నించారు. రేసుల నిర్వహణకు సంబంధించి ప్రతి విషయం మంత్రిత్వశాఖకు తెలుసని ఆయన చెప్పినట్లు సమాచారం. ఏస్‌నెక్స్ట్‌జెన్ ఒప్పందానికి విరుద్ధంగా వైదొలగడంతో ప్రభుత్వం నిధులు చెల్లించాల్సి వచ్చిందని, ఆ సంస్థపై ఎందుకు చర్యలు చేపట్టలేదని అధికారులు అడిగారని సమాచారం. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాను ప్రభుత్వానికి సూచించానని ఆయన సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. మంత్రి మండలి ఆమోదం లేకుండా, ఆర్థికశాఖ అనుమతి తీసుకోకుండానే నిధులు ఎలా చెల్లించారని అడగ్గా, మంత్రిమండలి ఆదేశాల ప్రకారమే నిధులు విడుదల చేశామని, రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధం లేదు కాబట్టి ఆర్థికశాఖ అనుమతి తీసుకోలేదని ఆయన వివరించినట్లు సమాచారం. మరో స్పాన్సర్‌ను వెతికేందుకు ప్రయత్నాలు జరిగాయని, సమయాభావం వల్ల వీలుపడలేదని చెప్పినట్లు తెలుస్తోంది. అధికారులుగా తాము సొంత నిర్ణయాలు తీసుకోలేదని, మంత్రిత్వశాఖ చెప్పినట్లే నడుచుకున్నామని, అన్ని విషయాలు ఎప్పటికప్పుడు బాధ్యులకు చెబుతూనే ఉన్నామని అర్వింద్‌కుమార్ స్పష్టం చేసినట్లు సమాచారం.

**పైస్థాయిలో తీసుకున్న నిర్ణయాలే**

ఈడీ అధికారులకు బీఎల్ఎన్‌రెడ్డి కూడా అర్వింద్‌కుమార్‌లాగే సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. ఎఫ్ఈవోకు నిధుల చెల్లింపునకు సంబంధించి నాడు చీఫ్ ఇంజినీర్ హోదాలో ప్రొసీడింగ్స్ ఇచ్చింది ఆయనే. దాంతో ప్రతిపాదనలు సిద్ధం చేయడం దగ్గర నుంచి నిధుల బదిలీ వరకూ అనేక అంశాలను అధికారులు అడిగినట్లు తెలుస్తోంది. ఉదయం 10 గంటలకు ఈడీ కార్యాలయానికి చేరుకున్న ఆయన రాత్రి 7 గంటల సమయంలో తిరిగి వెళ్లారు. ఎఫ్ఈవోకు నిధులు చెల్లించడంలో తన పాత్ర పరిమితమని, పై అధికారులు తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడం తప్ప తన ప్రమేయం ఏమీ లేదని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. స్పాన్సర్‌షిప్ మొదలు రేసు నిర్వహణకు అయ్యే ఖర్చులు, వాటి చెల్లింపుల వంటివన్నీ పైస్థాయిలో తీసుకున్న నిర్ణయాలేనని, అధికారులు జారీ చేసిన ఆదేశాలను తాను పాటించానని చెప్పినట్లు తెలిసింది. నాటి ఉత్తర ప్రత్యుత్తరాలకు సంబంధించిన కొన్ని ధ్రువపత్రాలను సమర్పించినట్లు సమాచారం.

## మందు ప్రియులకు షాక్ కింగ్ ఫిషర్ బీర్లకు బ్రేక్

- మొదటి పేజి తరువాయి

బోర్డులు వెలిసిన సంగతి తెలిసిందే. మరో రెండు నెలల్లో వేసవి కాలం స్టార్ట్ కానున్న వేళ కింగ్ ఫిషర్ బీర్ కంపెనీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం బీర్ ప్రియులకు షాకింగ్ న్యూస్ అనే చెప్పవచ్చు.ఇప్పటికే హైదరాబాద్ సిటీలోని కొన్ని మద్యం షాపుల్లో కింగ్ ఫిషర్ లైట్ బీర్లు అందుబాటులో లేవు. కింగ్ ఫిషర్ బదులుగా ట్యూబర్గ్ లైట్ బీర్లను అమ్ముతున్నారు వ్యాపారులు. ప్రస్తుతం ఆయా వైన్ షాపులు, బార్లలో ఉన్న స్టాక్ కూడా ఒకటి రెండు రోజుల్లో కంప్లీట్ కానున్నట్లు తెలుస్తోంది. ఈలోపు కింగ్ ఫిషర్ బీర్ల సరఫరా కాకపోతే మాత్రం.. తెలంగాణలో కింగ్ ఫిషర్ బీర్లకు ప్రత్యామ్నాయం చూసుకోవాల్సిందే మందుబాబులు. మరీ తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ పెండింగ్ బిల్లులను చెల్లించి కేఎఫ్ బీర్ల సరఫరా ఆగిపోకుండా చూస్తుందా..? అలాగే బీర్ రేట్లు పెంచాలన్న కంపెనీ డిమాండ్ కు ఒకే చెబుతుందా లేదా అనేది వేచి చూడాలి.

## నాపై ఉన్న కేసు గురించి ఎవరూ ఆందోళన చెందవద్దు

తనపై నమోదైన ఫార్ములా ఈ-రేస్ కేసు గురించి పార్టీ నేతలు, కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాను ఏ తప్పూ చేయలేదని, ఎవరికీ భయపడేది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ డైరీని కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2001లో కేసీఆర్ పార్టీ పెట్టినప్పటి ఇబ్బందులతో పోలిస్తే ఇప్పటివి పెద్ద లెక్క కాదన్నారు.మనకు ఏదో ఇబ్బంది ఉన్నది అన్నట్లుగా కొంతమంది మాట్లాడారని, కానీ నిజంగా మనకు ఎలాంటి ఇబ్బందీ లేదన్నారు. తనపై నమోదైనది ఓ లొట్టపీసు కేసు అని వ్యాఖ్యానించారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఈ కేసులో వారు చేసేదేమీ లేదన్నారు. కాబట్టి ఇబ్బంది ఉండదన్నారు. కేసులు అసలు సమస్యే కాదన్నారు.ఈ కేసుపై తాను పోరాడతానన్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ బిడ్డగా, ఆయన తయారు చేసిన సైనికుడిగా ఎంతో ధైర్యంగా ఉంటానన్నారు. తెలంగాణలో 90 లక్షల మంది మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తున్నట్లు ఢిల్లీ కాంగ్రెస్ నేతలు అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. రైతు భరోసా విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరంగా చెప్పాలన్నారు.

# పోర్టు హాస్పిటల్ టెండర్ పేరుతో ఎవరు వచ్చినా అడ్డుకుంటాం

- సిఐటియు అధ్యక్షులు వి.ఎస్ పద్మనాభ రాజు
- 100వ రోజు టెంట్ లోనే న్యూ ఇయర్ వేడుకలు



సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 08 : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీక నాపాలని 100వ రోజు నిరసన దీక్షలో పద్మనాభ రాజుగారు హెచ్చరించారు. పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించాలని తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, పోర్టు హాస్పిటల్ వద్ద 100వ రోజు నిరసన దీక్ష కొనసాగింది. హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకోవాలని, తురిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమని, హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని, సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేట్ వారికి అప్పగించడం అనర్థమని తెలిపారు. విశాఖపట్నం పోర్టు విశాఖ అభివృద్ధికి కీలకమని, ప్రతీ ఏటా మున్సిపాలిటీకి సగటున 65 కోట్ల రూపాయలు పన్నులు కడుతున్న పోర్టును ప్రైవేట్ వారికి ఇచ్చి ధారాదాతత్వం చేయడం అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుందని అన్నారు.

వాయిదాలు వేయడం కాదు పూర్తిగా టెండర్లు రద్దు చేయాలి. ఈ వాయిదాలు వేయడం కూడా కార్మిక వర్గ పోరాట ఫలితమే.పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ, ప్రైవేటీకరణపై తీసుకున్న నిర్ణయం అన్యాయమని, ఈ విధానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె. సత్యనారయణ, జె.సత్యనారయణ, రామలింగేశ్వరరావు, కె.ఎస్ కుమార్, నాయుడు , తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హౌస్ గా మారుతుంది

- చంద్రబాబు నేతృత్వంలో 2047 విజన్ సాకారం అవుతుంది
- పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు
- విశాఖలో ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్ లో మంత్రి నారా లోకేష్



సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 08 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో 2047 విజన్ సాకారం అవుతుందని, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హౌస్ గా మారుతుందని విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఏపీ డీటీఐ(డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ), ఎస్టీపీఐ(సాఫ్ట్ వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్-2025 కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మిట్ ను లాంఛనంగా ప్రారంభించారు. ఏడు రంగాల్లో ఐటీ అభివృద్ధి, డీప్ టెక్నాలజీ ప్రాముఖ్యత, స్టార్టప్ ల వంటి అంశాలపై సదస్సులో చర్చించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మట్లాడుతూ.. ఏపీలో సాంకేతిక అభివృద్ధికి దిశానిర్దేశం చేయనున్న ఈ సమ్మిట్ లో పాల్గొనడం చాలా గర్వంగా ఉంది. భవిష్యత్ లో ఏపీ గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ హబ్ గా మారుతుంది. ఇన్నోవేషన్, డీప్ టెక్ నైపుణ్యాన్ని పెంపొందించడం ద్వారా ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి సాధ్యపడుతుంది. అభివృద్ధికి ఇన్నోవేషన్ చాలా ముఖ్యం. ఏఐ, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, హెల్త్ టెక్, ఎడ్యుటెక్, ఎనర్జీ స్మార్ట్ సొల్యూషన్స్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీ రోబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. సామాజిక సమస్యల పరిష్కారానికి ఐటీ,ఎలక్ట్రానిక్స్,మెడ్ టెక్, స్మార్ట్ టెక్నాలజీస్ కలసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉంది. ఆరోగ్యరంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఏవిధమైన మార్పులు తీసుకువచ్చిందో మనం చూశాం.

ఏపీని 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతాం 2047 నాటికి ఏపీని 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతాం. 2020 విజన్ భాగంగా చంద్రబాబునాయుడు ఐటీని అభివృద్ధి చేశారు. ఇప్పుడు విజన్ 2047లో భాగస్వామ్యం కావడం నా అదృష్టం. చంద్రబాబునాయుడు సారథ్యంలో 2047 కలను సాకారం చేస్తాం. ఉద్యోగాలు పొందేందుకు, కల్పించేందుకు ఇన్నోవేషన్ తో పాటు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలో సమూల మార్పులు తీసుకువస్తాం. ఉన్నత విద్యను సంస్కరిస్తాం. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ లో ఏపీ ప్రస్తుతం 9వ స్థానంలో ఉంది. దీనిని 3వ స్థానానికి తీసుకువస్తాం. ఇందుకు పరిశ్రమ వర్గాలు తమవంతు సహకారం అందించాలి. విశాఖలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర సాంకేతిక విప్లవంలో ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్ తనవంతు పాత్ర పోషించాలి. సంక్షోభాలనే అవకాశాలుగా మలచుకోవాలని మా నాయకుడు చెప్పారు. ఇది మన అవకాశం. అభివృద్ధిని వికేంద్రీకరిస్తాం ఏపీ అభివృద్ధికి ప్రధాని ఎంతో సహకరిస్తున్నారు. నేడు 2 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తాం. రాయలసీమలోని అనంతపూర్ కు కియా పరిశ్రమ రావడం ద్వారా తలసరి ఆదాయంలో 3వ స్థానంలో ఉండి గోదావరి జిల్లాలతో పోటీపడుతోంది. కర్నూలును రెన్యువబుల్ ఎనర్జీ హబ్ గా రూపొందిస్తాం. చిత్తూరు, కడపను ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ హబ్ గా మారుస్తాం. గోదావరి జిల్లాలను ఆక్వా హబ్ గా మారుస్తాం. ఉత్తరాంధ్రకు త్వరలోనే ప్రపంచంలోనే అతిపెద్ద కెమికల్ పార్క్ రాబోతోంది. విశాఖకు డేటా సెంటర్ తీసుకువస్తాం. త్వరలోనే టీసీఎస్ రాబోతోంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను నెలకొల్పుతాం. పారిశ్రామికవేత్తలకు అన్ని విధాల సహకారం అందిస్తామని మంత్రి నారా లోకేష్ తెలిపారు.విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ మాట్లాడుతూ.. ఏపీలో ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. సంక్షోభాలనే అవకాశాలుగా మల్చుకుందాం. ఈ ఐదేళ్లు చాలా కీలకం. నూతన ఆవిష్కరణలకు సిద్ధంగా ఉన్నాం. విశాఖను ఐటీ హబ్ గా మార్చేందుకు అవసరమైన ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం. పరిశోధన రంగాన్ని కూడా మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఎన్ఎఫ్ ఛైర్మన్ శ్రీధర్ కొసరాజుతో పాటు కేడీఈఎమ్ ఛైర్మన్ బీవీ నాయుడు, అలోన్ఓఎస్ కో-ఫౌండర్ సీపీ గుర్నాని, ఎస్టీపీఐ డైరెక్టర్ సి.కవిత, ఐటీఏఏపీ ప్రెసిడెంట్ లక్ష్మీ ముక్కవిల్లి తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని సభకు 32వ వార్డు నుంచి రెండు వేల మంది హాజరు కందుల నాగరాజు



సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 08 : విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజి గ్రౌండ్ లో నిర్వహించనున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభను విజయవంతం జరిపేందుకు కూటమి నాయకులు కార్యకర్తలు వెళ్తున్న 150 ఆటోలకు విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కందుల నాగరాజు మాట్లాడుతూ సుమారుగా రెండువేల మంది తమ వార్డు నుంచి ప్రధాని నరేంద్ర మోడీ సభకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వం లో రెండు లక్షల కోట్ల పైబడిన విలువైన ప్రాజెక్టులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ప్రధాని నరేంద్రమోడీ హాజరవుతున్నట్లు తెలిపారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయడానికి కూటమి నాయకులు శాయశక్తుల పని చేస్తున్నారని చెప్పారు. ఎన్నడూ లేని విధంగా ఈ సారి ప్రధాని బహిరంగ సభకు భారీగా ప్రజలు హాజరుకానున్నారని వెల్లడించారు.ఈ సభకు లక్షల్లో జనాలు హాజరై ఒక సరి కొత్త రికార్డును సృష్టించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ల ఆదేశాలతో ప్రధాని విశాఖ పర్యటనను విజయవంతం చేయడంలో తాము కృత నిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఓ మంగ,వెల్ఫేర్ సెక్రెటరీ,ఆర్పీలు, సచివాలయ%శీ% సిబ్బంది, టీడీపీ ప్రెసిడెంట్ డి.దుర్గారెడ్డి, జనసేన ప్రెసిడెంట్ టి.అర్జున్,బిజెపి ప్రెసిడెంట్ శాలివాహన,కందుల కృష్ణ, సిపిఐ బుజ్జి,దాసన సత్యనారాయణ, కుమారి, వర, శ్రీదేవి, కోదండమ్మ, ఆటో అప్పారావు,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 6 గ్యారంటీల పేరుతో మోసం.

- రైతు బంధు రూ.15 వేలు అని రూ.12 వేలకు తగ్గింపు.
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 08, కాంగ్రెస్ 6 గ్యారంటీల పేరుతో మోసం రైతు బంధు రూ.15 వేలు అని రూ.12 వేలకు తగ్గింపు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన రైతులకు రైతు బంధు అందించని దుస్థితిలో కాంగ్రెస్ ఉన్నదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు తెలిపారు. కాంగ్రెస్ మాయ మాటలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టే దిశగా వెళుతుంది. తప్ప ప్రజలకు మేలు చేసే పనులు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రైతులకు రైతు బంధు ఎకరాకు రూ.15 ఇస్తామని చెప్పి సంవత్సరం గడిచిన రైతు బంధు ఇవ్వలేదని, రైతులు పంట సాయం కోసం ఎదురుచూసి నిరాశే మిగిలిందన్నారు. ఎన్నికలో ఇచ్చిన హామీ ప్రకారం రైతు బంధు రూ.15 వేలు 15 వేలు ఇయ్యలేమని, రూ.12 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరైనది కాదన్నారు. రైతుబందుకు కాంగ్రెస్ ఒక సంవత్సరం ఎగ్గొట్టిందని దానిని కలిపి రైతుల ఖాతాలో జమ చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

# ఫిబ్రవరి 4,5 తేదీల్లో భద్రాచలంలో జరిగే పి డి యస్ యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ జయప్రదం చేయండి.

- పి డి యస్ యూ.
- భద్రాచలం కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ, మెడికల్, న్యాయ కళాశాలలను ఏర్పాటు చేయాలి.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 08,బత్తుల వెంకటేశ్వర రావు నడి ఆడిన నేల, జంపాల చంద్ర శేఖర్ ప్రసాద్ అమరత్వం పొందిన గడ్డ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో ఫిబ్రవరి 4,5 తేదీల్లో జరిగే పి డి యస్ యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ను విద్యార్థులు జయప్రదం చేయాలని పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పెద్దింటి రామకృష్ణ, నామాల ఆజాద్, పి డి యస్ యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ పిలుపు నిచ్చారు. బుధవారం భద్రాచలం పట్టణంలో పి డి యస్ యూ భద్రాచలం డివిజన్ కార్యదర్శి మునిగల శివ ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.

పి డి యస్ యూ అసమాన త్యాగాలతో ముందుకెళుతూ అర్థ శతాబ్దం పూర్తి చేసుకున్నదని ఈ క్రమంలోనే ప్రగతి శీల విద్యార్థి ఉద్యమ నిర్మాత జార్జిరెడ్డి,పి డి యస్ యూ వ్యవస్థాపకులు జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, విద్యార్థుల ప్రియాతి ప్రియమైన నాయకులు శ్రీపాద శ్రీహరి కోలాశంకర్ రంగవల్లి చేరాలు రమణయ్య సాంబయ్య రంగవల్లి లాంటి ఎంతోమంది విద్యార్థి వీరులు శాస్త్రీయ విద్య కోసం,సమ సమాజ స్థాపనకై, విద్యార్థుల హక్కుల కై అసువులు బాషారని వారి స్పూర్తితోనే నేటికీ విద్యార్థి ఉద్యమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. పాలకులు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల ను బట్టబయలు చేస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికై అనునిత్యం పోరాడుతూ ప్రభుత్వ విద్య బలోపితం కై పి డి ఎస్ యు సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. అందులో భాగంగానే భవిష్యత్తు ఉధ్యమాలను బలోపితం చేసేందుకు దిశా నిర్దేశాలను రూపొందించుకుంటూ ఉద్యమాలలో ముందుకు సాగేందుకు పి డి యస్ యూ రాష్ట్ర కౌన్సిల్ ను ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా విద్యార్థులను చైతన్య పరిచేందుకు రెండు రోజులపాటు రాజకీయ తరగతులు బోధించు కోవడం జరుగుతుందని వారు తెలిపారు. అదేవిధంగా భద్రాచలం కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ మెడికల్ కళాశాల న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని అనేక ఉద్యమాలు నిర్వహించడం జరిగిందని అయినా ప్రభుత్వాలు ఏమాత్రం స్పందించకుండా ఈ ప్రాంత గిరిజన విద్యార్థులను మోసం చేస్తుందని వారు అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించి గిరిజన యూనివర్సిటీ మెడికల్ శాల న్యాయ కళాశాలలను ఏర్పాటు చేసే విధంగా ఇప్పుడు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

# వాసవి క్లబ్ అధ్యక్షునిగా నాగేశ్వరావు.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 08,భద్రాచలం వాసవి క్లబ్ అధ్యక్షునిగా తోకల నాగేశ్వరావు ఎన్నికయ్యారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో జరిగిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యుల సమావేశంలో భద్రాచలం వాసవి క్లబ్ 2025 కార్యవర్గం ను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తోకల నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శిగా అద్దంకి శ్రీనివాస మూర్తి, కోశాధికారిగా గుడుమాసు వెంకట సత్యనారాయణ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ చారుగుళ్ల శ్రీనివాస్,జిల్లా సహాయ కార్యదర్శి బండారు కృష్ణయ్య, రీజినల్ చైర్మన్ మనోహర్, మాజీ అధ్యక్షులు, వాసవియన్స్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకులు అరెస్ట్



సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 08 : ప్రధాని మోదీ విశాఖ పర్యటన సందర్భంగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులతో మద్దిలపాలెం జంక్షన్ ఆంధ్ర యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ధర్నాకు దిగారు, ఈ సందర్భంగా పోలీస్ వారు అరెస్ట్ చేసి ఎం వి పి పోలీస్ స్టేషన్ కి తరలించారు, అరెస్ట్ అయిన వారిలో జాతీయ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ మరియు ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ మమతా నాగిరెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు, రాష్ట్ర కార్యదర్శి చినిబిల్లి శివ కుమార్ , విశాఖ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లిపిల్లి సతీష్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ రెడ్ క్రాస్ సొసైటీ లో స్వర్గీయ పంపాన రవిశంకర్ దశ కర్మ జ్ఞాపకార్థం అన్న సమారాధన



సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 08 : విశాఖపట్నం,పెదవాల్తేరు,పంపాన వంశస్తులు స్వర్గీయ పంపాన రవి శంకర్, దశ కర్మ,జ్ఞాపకార్దం,విశాఖపట్నం రెడ్ క్రాస్ సొసైటీ నిరాశ్రాయుల వసతి నందు నిరుపేదలకు,వృద్ధులకు,అనాధలకు అన్నసమర్పణ,అందజేయడంమైనది.ఈ కార్యక్రమం లో వారి కుమారుడు, పంపాన నిషాంత్,సతీమణి పుష్పా,పెద్దఅమ్మలు, సులోచన, సావిత్రి, వరలక్ష్మి,అనంతలక్ష్మి,శాంత,చినలక్ష్మి,మేనల్లుడు అవినాష్,పంపాన ఆనంద్ బ్రదర్స్, వదినలు,పద్మావతి,కుమారి, పద్మ,దివ్య,సుదారాణి, రెడ్ క్రాస్ సొసైటీ నిర్వాహకులు మురళి పాల్గొన్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నాయకుల దౌర్జన్యాలు కొనసాగుతున్నాయి, బిజెపి పార్టీ ఆఫీస్ పై దాడిని ఖండిస్తున్నాము,



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 8.యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని బిజెపి పార్టీ మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్,మండల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకుల ఆదేశానుసారం,జిల్లా నాయకులు మండల నాయకులు పాల్గొని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దౌర్జన్యాలకు నిరసన తెలుపుతూరాస్తారో నిర్వహించి,సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసినారు. మీడియా ద్వారా మాట్లాడుతూ హైదరాబాదులోని నాంపల్లి బిజెపి పార్టీ రాష్ట్ర కార్యాలయంపై, కాంగ్రెస్ యువజన నాయకులు కార్యకర్తలుపాల్గొని, బిజెపి పార్టీ ఆఫీసును ముట్టడించి దౌర్జన్యం చేసినారని, దీనికి నిరసనగా, బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ ఖండించినారు, ఈ కార్యక్రమంలో సీఎన్ రెడ్డి, బందారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ,అశోక్ రెడ్డి, కొప్పుల యాదిరెడ్డి,మంద నరసింహ, బచ్చు శ్రీను, లోడే లింగస్వామి,మందుల నాగరాజు,రేగురి అమరేందర్ శివకుమార్ రమేష్ బొడిగాఆనంద, రావుల పద్మారెడ్డి ప్రభాకర్,పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం.

- స్వయం సహాయక సంఘాల ద్వారా 1000 మెగావాట్ల ఉత్పత్తి.
- త్వరలో టెండర్లు ఖరారు చేస్తాం.
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జనవరి 08,**రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసి 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ ల ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రగతిని బుధవారం ప్రజా భవన్ లో మంత్రులు సీతక్క, కొండ సురేఖలతో కలిసి డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదల కు అవకాశాలు ఏర్పడతాయని డిప్యూటీ సీఎం తెలిపారు. అందుకుగాను అంది వస్తున్న కొత్త విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటు లోకి తెస్తున్నాం. పెద్ద మొత్తంలో డబ్బు మహిళా సంఘాల చేతులకి వస్తున్న క్రమంలో వారు వివిధ వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని ఆదేశించారు.

మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటు కు వారికి అందుబాటులో ఉన్న భూమిని గుర్తించండి, అందుబాటు లో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. మహిళా సంఘాలు ప్లాంట్ల ఏర్పాట్లు లో ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారుల తో సమన్వయం చేయాలని సూచించారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ లో ఏర్పాటుకు విద్యుత్ శాఖ రెడ్కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలో టెండర్లు ఓపెన్ చేసి వాటిని ఖరారు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో సంఘాలను గుర్తించి నిర్ధారించడం, భూ సేకరణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం వంటి పనులను గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా కలెక్టర్లు త్వరి తగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఒక మెగావాటు ఉత్పత్తికి నాలుగు ఎకరాలు అవసరం ఉంటుంది.. ప్రతి జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు నాలుగు వేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని కలెక్టర్లకు తెలిపారు. దేవాదాయ, ఇరిగేషన్ శాఖల పరిధిలోని భూములను గుర్తించాలని.. కేంద్ర అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు భూమి అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందని తెలిపారు.

అటవీ ప్రాంతాల్లో భూములపై హక్కులు ఏర్పడినప్పటి కీ స్తంభాలు వేసి విద్యుత్ లైన్ ల ద్వారా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసే క్రమంలో అటవీ శాఖ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదని డిప్యూటీ సీఎం సూచించారు. సోలార్ విద్యుత్తు అందుబాటులోకి వస్తే అటవీ ప్రాంతాల్లోని రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు.

ఈ దిశగా కలెక్టర్లు పనిచేస్తే గిరిజనులు ఆత్మగౌరవంతో బతికే అవకాశం స్పష్టంగా ఉందని తెలిపారు. ప్రతి నియోజకవర్గం లో స్మాల్, మైక్రో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నాలుగు నుంచి ఐదు ఎకరాలు భూమి అవసరం అవుతుంది. చిన్నపాటి ఇండస్ట్రియల్ ఏరియాల ఏర్పాటుకు అధికారులు భూములు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారం చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు.

అటవీ హక్కుల ద్వారా లభించిన భూముల్లో అవకాడో వంటి పంటలు సాగు చేస్తే అటవీ సంపద పెరగడంతో పాటు గిరిజనులు ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలిపారు. రాష్ట్రంలో 6.67 లక్షల ఎకరాలను ఇప్పటి వరకు ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేయగా ఆ భూముల్లో లాభసాటి పంటల సాగు జరగడంలేదని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఇకనుంచి ఆ భూముల్లో ఉపాధి హామీ, గిరిజన శాఖ, స్వయం సహాయక సంఘాల ద్వారా వచ్చే పథకాలు అన్నిటిని సమన్వయం చేసుకొని ఆర్థికంగా ప్రయోజనం కలిగించే పంటల సాగును ప్రోత్సహించ డానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని గిరిజన శాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు.

గిరిజనులకు ఆదాయం తక్కువగా ఉంటుంది ... భూమి లభ్యత ఎక్కువగా ఉంటుంది ఈ నేపథ్యంలో అచ్చంపేట నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో భూములపై అధికారులు దృష్టిపెడితే గిరిజనులకు ప్రయోజనం జరుగుతుందని మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో భారీ భవంతుల పైన సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో గుట్టల తో విస్తరించిన భూములు అత్యధికంగా ఉన్నాయి వీటి పైన సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసే ఆలోచన చేయాలని ఇంధన శాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. వీటి ఏర్పాటు ద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణకు అవకాశం ఉంటుందని వివరించారు. ప్రధానమంత్రి పీఎం కూసుమ్ పథకంలో భాగంగా రైతులు రెండు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఏర్పడింది.. ఈ దిశగా రైతులను చైతన్యం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. టీజీ రెడ్కో పోర్టల్ ద్వారా రైతులు సోలార్ పవర్ ఉత్పత్తికి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉందని... దీని ద్వారా తక్కువ ధరకు విద్యుత్తు అందుబాటులోకి రావడం మే కాకుండా కాలుష్య రహిత విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం...





- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు
- స్వయం సహాయక సంఘాల ద్వారా వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- త్వరలో టెండర్లు ఖరారు చేస్తాం
- స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటు ప్రగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జనవరి 8:** రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

బుధవారం ఉదయం ప్రజా భవన్ నుండి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రివర్యులు ధనసరి అనసూయ (సీతక్క), దేవాదాయ శాఖామాత్యులు కొండ సురేఖ, రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసి వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి, ఇంధన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖల ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రగతిపై జిల్లా కలెక్టర్ లతో ఉప ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ వీడియో సమావేశంలో ఖమ్మం క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయని, అందుకుగాను అంది వస్తున్న కొత్త విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ క్రమంలో మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటు లోకి తెస్తున్నామన్నారు. పెద్ద మొత్తంలో డబ్బు మహిళా సంఘాల చేతులకి వస్తున్న క్రమంలో వారు వివిధ వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటుకు వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు.

మహిళా సంఘాలు సోలార్ ప్లాంట్ల ఏర్పాటులో ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలని, మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ లో ఏర్పాటుకు విద్యుత్ శాఖ రెడ్కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలో టెండర్లు ఓపెన్ చేసి వాటిని ఖరారు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో సంఘాలను గుర్తించి నిర్ధారించడం, భూ సేకరణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం వంటి పనులను గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా కలెక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ఒక మెగావాటు ఉత్పత్తికి నాలుగు ఎకరాలు అవసరం ఉంటుందని, ప్రతి జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు నాలుగువేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని కలెక్టర్లకు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో భూములపై హక్కులు ఏర్పడినప్పటికీ స్తంభాలు వేసి విద్యుత్ లైన్ ల ద్వారా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసే క్రమంలో అటవీ శాఖ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఈ నేపథ్యంలో ఆయా భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదని డిప్యూటీ సీఎం సూచించారు. సోలార్ విద్యుత్తు అందుబాటులోకి వస్తే అటవీ ప్రాంతాల్లోని రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ దిశగా కలెక్టర్లు పనిచేస్తే గిరిజనులు ఆత్మగౌరవంతో బతికే అవకాశం స్పష్టంగా ఉందని తెలిపారు.

ప్రతి నియోజకవర్గంలో స్మాల్, మైక్రో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నాలుగు నుంచి ఐదు ఎకరాలు భూమి అవసరం అవుతుందని, చిన్నపాటి ఇండస్ట్రియల్ ఏరియాల ఏర్పాటుకు అధికారులు భూములు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారం చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు.

అటవీ హక్కుల ద్వారా లభించిన భూముల్లో అవకాడో వంటి పంటలు సాగు చేస్తే అటవీ సంపద పెరగడంతో పాటు గిరిజనులు ఆర్థికంగా బలోపేతంఅవుతారని తెలిపారు. రాష్ట్రంలో 6.67 లక్షల ఎకరాలను ఇప్పటివరకు ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేయగా ఆ భూముల్లో లాభసాటి పంటల సాగు జరగడంలేదని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇకనుంచి ఆ భూముల్లో ఉపాధి హామీ, గిరిజన శాఖ, స్వయం సహాయక సంఘాల ద్వారా వచ్చే పథకాలు అన్నిటిని సమన్వయం చేసుకొని ఆర్థికంగా ప్రయోజనం కలిగించే పంటల సాగును ప్రోత్సహించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని గిరిజన శాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. గిరిజనులకు ఆదాయం తక్కువగా ఉంటుందని, భూమి లభ్యత ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో అచ్చంపేట నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో భూములపై అధికారులు దృష్టిపెడితే గిరిజనులకు ప్రయోజనం జరుగుతుందని మంత్రి సీతక్క తెలిపారు.

హైదరాబాద్ వంటి మహానగరాల్లో భారీ భవంతుల పైన సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో గుట్టలతో విస్తరించిన భూములు అత్యధికంగా ఉన్నాయని, వీటి పైన సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసే ఆలోచన చేయాలని ఇంధన శాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. వీటి ఏర్పాటు ద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణకు అవకాశం ఉంటుందని వివరించారు.

ప్రధానమంత్రి పీఎం కుసుమ్ పథకంలో భాగంగా రైతులు రెండు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఏర్పడిందని, ఈ దిశగా రైతులను చైతన్యం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తెలంగాణ రెడ్కో పోర్టల్ ద్వారా రైతులు సోలార్ పవర్ ఉత్పత్తికి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉందని, దీని ద్వారా తక్కువ ధరకు విద్యుత్తు అందుబాటులోకి రావడమే కాకుండా కాలుష్య రహిత విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. వీడియో సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో 4 ప్రదేశాల్లో 24 ఎకరాల స్థలాన్ని సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు గుర్తించినట్లు, ఇంకనూ 150 ఎకరాల మేర స్థలం పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలతో తదుపరి చర్యలకు కార్యాచరణ చేస్తున్నట్లు తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ విక్రమ్ సింగ్, డిఆర్డీవో సన్యాసయ్య, విద్యుత్ ఎస్ఇ సురేందర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి క్యాలెండర్ సంస్థ ప్రగతికి ప్రతీక.

జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 08,**నూతన సంవత్సర సందర్భంగా చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ బలరాం, ఆదేశం మేరకు సింగరేణియులందరి కి ప్రేరణ కలిగేలా, నూతనోత్సాహం కలిగించేలా, సింగరేణి యాజమాన్యం సంస్థ సాధిస్తున్న బహుముఖ ప్రగతికి సంక్షేమానికి సామాజిక సేవలకు ప్రతీకగా రూపొందించిన కొత్త క్యాలెండర్ ను ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ బుధవారం జిఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్లను మణుగూరు ఏరియా లోని ప్రతి సింగరేణి ఉద్యోగికి అందజేయడం జరుగుతుందని అధికారి ప్రతినిధి, డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్ తెలియజేశారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమం లో ఎస్ఓ టు జిఎం డి. శ్యామ్ సుందర్ , ఏరియా ఇంజినీర్ ఆర్.శ్రీనివాస్, ఏజిఎం (సివిల్) డి. వెంకటేశ్వర్లు, డిజిఎం (ఐఈడి) కే వెంకట్ రావు, డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్, డిజిఎం (పర్చేస్) శ్రీనివాస మూర్తి , డిజిఎం (ఫైనాన్స్) ఎం అనురాధా , గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్ , ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణం రాజు , ఏరియా సర్వే అధికారి శైలెందర్ , ఏరియా రక్షణ అధికారి కే శ్రీనివాస్ , పర్యావరణ అధికారి జే శ్రీనివాస్ రావు, సీనియర్ ఎస్టేట్స్ అధికారి బాబుల్ రాజ్ , తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యాలయంపై చేసిన దాడిని ఖండిస్తున్నాము .

- కాంగ్రెస్ కార్యకర్తలు ఇకనైనా క్రమశిక్షణ అలవర్చుకోవాలి.
- బిజెపి పార్టీ జిల్లా నాయకులు మంద నరసింహ



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 8.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల, హైదరాబాదులో బిజెపి పార్టీ ఆఫీస్ పై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ జిల్లా నాయకులు మంద నరసింహ, మీడియాతో మాట్లాడుతూ ,పాలనలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విభజన రాజకీయాల్లో భాగంగానే హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి ప్రయత్నమని బిజెపి పార్టీ జిల్లా నాయకులు మంద నరసింహ అన్నారు,

కాంగ్రెస్ నేతలు గుండాలతో కలిసివచ్చి రాష్ట్ర బిజెపి కార్యాలయంపై బిజెపి నేతలపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.తమ సహనాన్ని అసమర్థతగా భావించొద్దన్నారు.

## ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు భాధ్యతగా విధులు నిర్వర్తించాలి.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 08,** తెప్పోత్సవం, వైకుంఠ ద్వార దర్శన మహోత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు భాధ్యతగా విధులు నిర్వర్తించాలి. సెక్టార్ల వారీగా కేటాయించిన అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు. ఈ నెల 9,10వ తారీఖుల లో జరగనున్న తెప్పోత్సవం మరియు వైకుంఠ ద్వార దర్శన ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. భద్రాచలంలోని ఏఎస్పీ కార్యాలయం నందు గల కాన్ఫరెన్స్ హాలులో సెక్టార్ల వారీగా కేటాయించ బడిన అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు చేయడం జరిగింది .అత్యంత వైభవంగా జరగనున్న తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శన ప్రదేశాలలో విధులు నిర్వర్తించే అధికారులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా,భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.1300 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు మరియు ట్రాఫిక్ రెగ్యులేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ రెండు రోజుల పాటు భద్రాచలం పట్టణంలో జరిగే ఉత్సవాలకు పోలీసు వారు సందర్భానుసారంగా విధించే ఆంక్షలకు ప్రజలు సహకరించాలని కోరారు.

# ఆకట్టుకున్న కరాటే కళ్యాణి హరికథ కాలక్షేపం.

- అధ్యయనోత్సవాల లో అలరించిన కార్యక్రమం.
- అంగరంగ వైభవంగా ముక్కోటి ఉత్సవాలు.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జనవరి 08, భద్రాచలంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల లో భాగంగా కళ్యాణ మండపం లో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో బుధవారం మధ్యాహ్నం మూవీ, టీవీ ఆర్టిస్ట్,శ్రీ ఆదిపట్ల కళాపీఠం ఫౌండర్ ప్రెసిడెంట్, బీజేపీ స్టేట్ ఎండోమెంట్ సెల్ జాయింట్ కన్వీనర్, గోరక్షక్, సనాతన ధర్మ రక్షక్ బాధ్యులు పడాల కళ్యాణి యాదవ్ (కరాటే కళ్యాణి) హరికథ కార్యక్రమం ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న దశావతారాల్లో 9వ రోజు స్వామివారి కృష్ణావతారం లో దర్శనమిచ్చారు. కళ్యాణ మండపంలో రామ రామ కృష్ణ కృష్ణ హరే హరే అంటూ సాగిన హరికథా కాలక్షేపం భక్తులను విశేషంగా అలరించింది. స్వామి వారు కళ్యాణ మండపం లోనికి విచ్చేసే టప్పుడు గోకులనంద గోవిందా అంటూ ఆలపించిన గానం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు వయోలిన్, మృదంగ కళాకారులు, దత్తు (కొత్తగూడెం) దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణికి స్పెషల్ క్యాంపెన్ 4.%హ% పురస్కారం.

- కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చేతుల మీదుగా స్వీకరించిన సీ.ఎం.డీ ఎన్.బలరామ్.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జనవరి 08, పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ఎక్కువ సంఖ్యలో ప్రదేశాలను పరిశుభ్రం చేసినందుకు సింగరేణి కాలరీస్ కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్పెషల్ క్యాంపెన్ 4.%హ% లో ఎక్కువ ప్రాంతాలను పరిశుభ్ర పరిచిన (మ్యాగ్జిమమ్ నెంబర్ ఆఫ్ సైట్స్ క్లీన్డ్ ) విభాగంలో అవార్డు వరించింది. ఢిల్లీలో బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చింతన్ శివిర్ లో భాగంగా మంగళవారం రాత్రి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ ఈ అవార్డును స్వీకరించారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోలిండియా, అనుబంధ సంస్థలు, నైవేలీ లిగ్నైట్ సంస్థల్లో గత ఏడాది అక్టోబరు 2వ తేదీ నుంచి అక్టోబరు 31వ తేదీ వరకు స్పెషల్ క్యాంపెన్ 4.0 పేరిట స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఇందులో సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో 157 చోట్ల పరిసరాలను పరిశుభ్రం చేయడాన్ని స్వీయ లక్ష్యంగా నిర్దేశించుకోవడం జరిగింది. అయితే 216 ప్రదేశాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టడం విశేషం. ఈ నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో ప్రదేశాలను శుభ్ర పరచిన విభాగంలో ఈ పురస్కారం లభించింది. సింగరేణి చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమానికి గుర్తింపు లభించడం పై సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. దేశ ఇంధన అవసరాలకు బొగ్గు ఎంత అవసరమో.. ఆరోగ్య భారతావనికి పరిశుభ్రత అంతే అవసరమన్నారు. సింగరేణి పరిశుభ్రతకు పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, బొగ్గు శాఖ అదనపు కార్యదర్శులు రూపేందర్ బ్రార్, విస్మితా తేజ్, సింగరేణి జీఎం బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం.

- వలిగొండ మండలం మాజీ జెడ్పిటిసి వాకిటి పద్మా అనంతరెడ్డి .



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 8. వలిగొండ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని రైతులకు వ్యవసాయానికి పెట్టుబడి సాయంగా ప్రతి ఎకరానికి రూ. 12 వేలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని.
రాష్ట్రంలో భూమిలేని కూలీలకు కూడా రూ. 12 వేలు ఇవ్వాలని సీఎం ప్రకటించారు. జనవరి 26వ తేదీ నుండి ఈ పథకం పూర్తిస్థాయిలో అమలు అవుతుంది.
గత పది ఏళ్లు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన బి,ఆర్ఎస్ ప్రభుత్వం, కెసిఆర్ రాష్ట్రాన్ని దివాలా తీయించారని.
ఆర్థికంగా దోపిడీ చేసిన, లక్షల కోట్ల అప్పుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని నిలువునా ముంచారని, మాజీ జెడ్పిటిసి వాకిటి పద్మ అనంతరెడ్డి అన్నారు.
రైతుకు చేదోడు వాదోడుగా ఉండాలని సదుద్దేశంతో ప్రభుత్వం రైతు భరోసా క్రింద ఆర్థిక సాయాన్ని పెంచిందని. గత పది ఏళ్లలో ప్రజలు కండ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన కెసిఆర్ ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని.జనవరి 26వ తేదీ నుండి రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందజేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోంద ని.మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 500 రూపాయలకే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను ప్రభుత్వం అమలు చేసిందని. వలిగొండ మండల పరిధిలోని బునాది గానికాలువ పూర్తి చేయుటకు 266 కోట్లు నిధులు కేటాయించిందని, రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, అభివృద్ధిని చూసి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కండ్లలోనిప్పులు పోసుకుంటున్నారు.
బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని నమ్మి ప్రజలు ఆందోళనకు గురికావద్దని, మాజీ జెడ్పిటిసి వాకిటి పద్మా అనంతరెడ్డి ,అన్నారు.
.

# ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు సర్వం సిద్ధం.

- పెద్ద ఎత్తున భక్తులు భద్రాచలానికి తరలి రావాలి.
- 9 నుండి 11వ తేదీ వరకు రివర్ ఫెస్టివల్ కు పెద్ద ఎత్తున ఏర్పాట్లు.
- భద్రాచలానికి విచ్చేసే భక్తులకు దైవ దర్శనం తో పాటు బోటింగ్, గిరిజన సంప్రదాయాలు, వంటకాలు, బెండలంపాడు ట్రెక్కింగ్ కనువిందు చేస్తాయి.
- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జనవరి 08, ముక్కోటి ఏకాదశి ఉత్సవాలలో భాగంగా 9వ తేదీ మరియు 10వ తేదీ లో జరగబోవు తెప్పోత్సవం మరియు ఉత్తర ద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా ఉత్తర ద్వారం వద్ద సెక్టార్ అధికారులకు తెప్పోత్సవం మరియు ద్వార దర్శనం రోజు తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులందరూ 10వ తేదీ తెల్లవారు జామున 3 గంటలకు అన్ని సెక్టార్ల అధికారులు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ భద్రాచలం ఆర్డీవో కార్యాలయంలో ముక్కోటి ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటు చేసిన పత్రికా సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈసారి ముక్కోటి ఏకాదశి మహోత్సవాల కు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ఆయన తెలిపారు. ఉత్తర ద్వార దర్శనం వద్ద భక్తులను నియంత్రించేందుకు సెక్టార్లుగా విభజించడం జరిగిందని తెలిపారు. పదవ తారీకు ఉదయం ఐదు గంటలకు స్వామివారి ఉత్తర ద్వార ద్వార ఉంటుందన్నారు. భద్రాచలం విచ్చేసే భక్తులు భద్రాచల రాముని దర్శించడంతోపాటు మంచి అనుభూతిని కలిగేలా ఏరు పండగను రూపొందించడం జరిగిందని తెలిపారు.

ఏరు అనగా కోయ మరియు తెలుగు భాషలలో నది అని అర్థం వస్తుందని గోదావరి, తాళి పేరు మరియు కిన్నెరసాని పరివాహక ప్రాంతాల్లో సాంప్రదాయాలు కలిసిన ప్రత్యేకమైన సంస్కృతి మన జిల్లాలో ఉందని ఆయన అన్నారు. గిరిజన సాంస్కృతి మరియు స్థానిక సాంప్రదాయాలు మరియు ఉత్పత్తులను అందరికీ తెలియపరచడమే ఏరు పండుగ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. దీనిలో భాగంగా గోదావరి ఘాటు వద్ద 9వ తారీకు నుండి 11వ తారీకు వరకు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, గిరిజన కళాకారులు, స్థానిక మరియు గిరిజన నృత్య ప్రదర్శనలు అందరూ వీక్షించేలా గోదావరి ఘాట్ వద్ద స్టేజిను రూపొందించడం జరిగిందన్నారు. అదేవిధంగా కరకట్ట వద్ద 50 స్టాళ్లను ఏర్పాటు చేసి ఆర్గానిక్ నెయ్యి అటవీ ఉత్పత్తులు గిరిజన ఉత్పత్తులు విక్రయించడం జరుగుతుందన్నారు. గోదావరి ఘాట్ వద్ద బోటింగ్ పాయింట్ ను ఏర్పాటు చేయడం జరిగిందని సామాన్యుల సైతం గోదావరిలో బోటింగ్ అనుభూతిని పొందేలా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గోదావరి నది ఒడ్డు పైన ఏర్పాటుచేసిన గుడారాలలో రాత్రి బస పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుందన్నారు. ఐటీడీఏ గిరిజన మ్యూజియం ఏర్పాటుకు ఐటీడీయో పిఓ ఎంతగానో కృషి చేశారన్నారు.

భద్రాచలం కి వచ్చిన భక్తులు మరియు పర్యాటకులు రాత్రి బస చేసి మరుసటి రోజు మ్యూజియం, బొజ్జికుప్ప బెండలంపాడు ట్రాకింగ్ చేసేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి దీవులను చూడాలనుకున్న వారు మన కిన్నెరసాని లో పర్యటించాల్సిందిగా కోరారు. ఈ ఏర్పాట్లు అన్నింటిని మహిళా సమాఖ్య ద్వారా సభ్యులు ఏర్పాటు చేయడం జరిగిందని నీ ద్వారా మహిళా సమాఖ్య అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ప్రస్తుతం ఈ రివర్ ఫెస్టివల్ లో పరిమిత సంఖ్యలో అనుమతిస్తున్నామని, మార్చ్ వరకు ఈ రివర్ ఫెస్టివల్ ను కొనసాగిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఉత్తర ద్వార దర్శనానికి విచ్చేసే భక్తులు ద్వార దర్శనం అనంతరం భారీ కెట్లు దాటవద్దని ప్రశాంతంగా దైవ దర్శనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# బూర్గంపహాడ్ మండలంలో ప్రమాదాలు



సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహడ్ జనవరి 8: బూర్గంపహాడ్ మండలంలోని కృష్ణసాగర్ మలుపు వద్ద ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మృతి చెందిన నెంబర్ సెవెన్ ఎస్ ఆర్ బి లో ఉండి కృష్ణ సాగర్ ఆర్ఎంపీగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిగా గుర్తించడం జరిగింది.
అదేవిధంగా ఐ.టి.సి.పి.యస్.స్పి.డి సారపాకలో గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల నగారా మోగించేవేళ వుడ్ యాడ్ లో ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మరణించడం జరిగినది. మరణించే వ్యక్తి జంగారెడ్డిగూడెం వాస్తవ్యులు. మరణించిన వ్యక్తి కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించాలని తద్వారా కుటుంబానికి తగిన న్యాయం చేయాలని వివిధ పార్టీల చెందిన నాయకులు డిమాండ్ చేసినారు.

# కార్తీక్ ను అభినందించిన కొత్వాల



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 08,రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ కొత్వాలను కలిసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ కాంగ్రెస్ నూతన అధ్యక్షులు చీకటి కార్తీక్ ఇటీవల యూత్ కాంగ్రెస్ కు జరిగిన ఎన్నికల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షునిగా విజయం సాధించిన చీకటి కార్తీక్ లిరాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్, డి సి ఎం ఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ను మర్యాదపూర్వకంగా కలిశారు.
బుధవారం పాత పాల్వంచలోని కొత్వాల స్వగృహానికి వెళ్లిన కార్తీక్, కొత్వాల ను శాలువా తో సత్కరించారు.
చీకటి కార్తీక్ ను అభినందించిన కొత్వాల జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత మొదటిసారి తన గృహానికి వచ్చి, తనను కలిసిన కార్తీక్ ను కొత్వాల అభినందించారు. ఆయనతో పాటు నియోజకవర్గ స్థాయి, మండల, పట్టణ స్థాయిల్లో ఎన్నికైన నాయకులకు కొత్వాల శుభాకాంక్షలు తెలిపారు. ఏ ఎన్నిక జరిగిన కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, విజయం కోసం శ్రమించాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గులాం మతిన్, కుంచం వెంకటేష్, తాటి పవన్, పాల్వంచ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, కాంగ్రెస్ నాయకులు ఉండేటి శాంతివర్ధన్, జక్కుల రాము, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ పై అవగాహన.

**రవాణా శాఖ ఆధ్వర్యంలో అమ్మ జన్మనిస్తే -హెల్మెట్ పునర్జన్మనిస్తుంది.**

**సంగం వెంకట పుల్లయ్య ఎంబీఐ.**

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 08,రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతున్న నేపథ్యంలో, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగం చేస్తే ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకోవడం సాధ్యమవుతుందని రవాణా శాఖ మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య సూచించారు.
ద్విచక్ర వాహనదారుల లో హెల్మెట్ పై అవగాహన కల్పించేందుకు భద్రాచలం ఆర్టిఏ కార్యాలయం ఆధ్వర్యం లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, ఆర్టిఏ కార్యాలయం ముందు వాహనదారుల ను ఆపి హెల్మెట్ వినియోగం మరియు దాని ప్రాముఖ్యత గురించి వివరించారు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల పై అధ్యయనం చేస్తే, అన్ని వాహనాల్లో ప్రయాణించే వారిలో 35% మంది ద్విచక్ర వాహనదారులుగా ఉండడం గమనార్హం. ప్రమాద సమయం లో తలకు హెల్మెట్ ఉండటం వల్ల తలకు గాయాలు కాకుండా ప్రాణాలు కాపాడుకోవడం సాధ్యమవుతుందని వెంకట పుల్లయ్య వివరించారు.
హెల్మెట్ వినియోగానికి సంబంధించిన ముఖ్య సూచనలు:
1. క్వాలిటీ హెల్మెట్: నాణ్యమైన హెల్మెట్ ను ఉపయోగించాలి.
2. సురక్షిత బెల్ట్: మెడ వద్ద స్ట్రాప్ (బెల్ట్) గట్టిగా వేసుకోవాలి.
3. విఆర్ఎస్: ప్రయాణించే ప్రతిసారి హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలి.
రహదారులపై ప్రతి ఒక్కరు బాధ్యతతో వ్యవహరించి, హెల్మెట్ ధరించడం ద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో ప్రజలు విశేషంగా పాల్గొని అవగాహన పెంచుకున్నారు.




# రైతు పక్షపాతి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు తుమ్మల శ్రీనివాస్ .



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 8. వలిగొండ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ,
రాష్ట్రంలోని రైతులకు వ్యవసాయానికి పెట్టుబడి సాయంగా ప్రతి ఎకరానికి రూ. 12 వేలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని.
రాష్ట్రంలో భూమిలేని కూలీలకు కూడా రూ. 12 వేలు ఇవ్వాలని సీఎం ప్రకటించారు. జనవరి 26వ తేదీ నుండి ఈ పథకం పూర్తిస్థాయిలో అమలు అవుతుంది.
గత పది ఏళ్లు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన బి,ఆర్ఎస్ ప్రభుత్వం, కెసిఆర్ రాష్ట్రాన్ని దివాలా తీయించారని.
ఆర్థికంగా దోపిడీ చేసిన, లక్షల కోట్ల అప్పుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని నిలువునా ముంచారని, జిల్లా నాయకులు తుమ్మల శ్రీనివాస్ అన్నారు.
రైతుకు చేదోడు వాదోడుగా ఉండాలని సదుద్దేశంతో ప్రభుత్వం రైతు భరోసా క్రింద ఆర్థిక సాయాన్ని పెంచిందని. గత పది ఏళ్లలో ప్రజలు కండ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన కెసిఆర్ ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని.జనవరి 26వ తేదీ నుండి రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందజేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోంద ని.మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 500 రూపాయలకే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను ప్రభుత్వం అమలు చేసిందని. వలిగొండ మండల పరిధిలోని బునాది గానికాలువ పూర్తి చేయుటకు 266 కోట్లు నిధులు కేటాయించిందని, రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, అభివృద్ధిని చూసి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కండ్లలోనిప్పులు పోసుకుంటున్నారు.
బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని నమ్మి ప్రజలు ఆందోళనకు గురికావద్దని, జిల్లా నాయకులు తుమ్మల శ్రీనివాస్ ,అన్నారు.
.

# పారా లీగల్ వాలంటరీలకు శిక్షణ తరగతులను ప్రారంభించిన న్యాయ మూర్తి పాటిల్ వసంత్

## సామాజిక బాధ్యతతో న్యాయ సేవలందించే కర్తవ్య బాధ్యత...




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 08,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నూతనంగా ఏర్పడి జాయిన్ పారా లీగల్ వాలంటరీస్ కు నేషనల్ లీడల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ పాటిల్ వసంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ, పారా లీగల్ వాలంటరీలు న్యాయ సేవలలో ఒక ముఖ్యమైన భాగస్వామ్యం వహిస్తూ, సామాజిక బాధ్యతను స్వీకరించి నిరక్షరాస్యులు, నిరుపేదలకు న్యాయ సేవలను చేరవేయడం లో కీలక పాత్ర పోషిస్తున్నారు. న్యాయానికి దూరమైన గ్రామీణులు, పట్టణ ప్రజానీకం న్యాయంపై చైతన్యాన్ని పొందేలా చైతన్య సదస్సులు నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పిలుపునిచ్చారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గొల్లపూడి భానుమతి ఆధ్వర్యంలో పారా లీగల్ వాలంటరీలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీని సత్య నారాయణ, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్స్ వి. పురుషోత్తమరావు, డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పట్టుపల్లి నిరంజన్ రావు, లీగల్ కౌన్సిలర్లు నాగ స్రవంతి, జ్యోతి విశ్వకర్మ, సిడిపిఓ హరి కుమారి, న్యాయవాదులు మారపాక రమేష్ పాల్గొన్నారు.పారా లీగల్ వాలంటరీలకు ఈ శిక్షణ ద్వారా వారు న్యాయ సూత్రాలను సామాజిక విభాగాలకు చేరవేయాలని తెలిపారు.

# రైతుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేయాలి.....

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ప్రతి వ్యవసాయ క్లస్టర్ పరిధిలో 25 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు
- రైతు బీమా క్లెయిమ్ లు సకాలంలో పూర్తి చేయాలి
- ఎరువుల కొరత ఎక్కడ రాకుండా చర్యలు తీసుకోవాలి
- ఆయిల్ పామ్ సాగు, రైతు భీమా, ఎరువుల లభ్యత, ఆయిల్ పామ్, క్రాప్ బుకింగ్, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జనవరి 8:** జిల్లాలోని రైతుల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయిల్ పామ్ సాగు, రైతు భీమా, ఎరువుల లభ్యత, క్రాప్ బుకింగ్ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ప్రతి క్లస్టర్ పరిధిలో రైతు భీమా క్రింద వచ్చిన క్లెయిమ్, ఎల్.ఐ.సి. కు సమర్పించిన క్లెయిమ్, చెల్లింపులు ఆలస్యానికి కారణాలు, వాటిని ఎలా సరి చేస్తారు వంటి పలు అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు రైతు బీమా క్రింద 420 దరఖాస్తులు వస్తే వ్యవసాయ శాఖ నుంచి 347 దరఖాస్తులు ఎల్.ఐ.సి. కు సమర్పించడం జరిగిందని, 311 రైతు కుటుంబాలకు సహాయం క్లెయిమ్ సొమ్ము అందిందని, 36 పురోగతిలో ఉన్నాయని అన్నారు.జిల్లాలో 73 రైతు బీమా దరఖాస్తులు ఎల్.ఐ.సి. కు సమర్పించకపోవడానికి గల కారణాలను కలెక్టర్ ఆరా తీశారు. వ్యవసాయ అధికారులు సంబంధిత మండలాల తహసిల్దార్ లతో సమన్వయం చేసుకుంటూ డెత్ సర్టిఫికెట్ లు త్వరగా మంజూరు అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. రైతు మరణించిన సమయంలో దుఖంతో ఉండే రైతు కుటుంబాన్ని కొంత ఆదుకునే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు బీమా పథకం అమలు చేస్తుందని, నిర్ణిత సమయంలో రైతులకు తప్పనిసరిగా చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు. వ్యవసాయ అధికారులు మానవీయ దృక్పథంతో పని చేయాలని, రైతులు అందించిన దరఖాస్తులలో ఏవైనా డాక్యుమెంట్ లేకపోతే మనమే వాటిని సమకూర్చే మార్గం తెలియజేయాలని కలెక్టర్ అన్నారు.

ప్రతి మండల వ్యవసాయ అధికారి తన పరిధిలో క్లస్టర్ లలో పెండింగ్ రైతు భీమా దరఖాస్తులపై సమీక్ష నిర్వహించి వచ్చే సమావేశం నాటికి పెండింగ్ ఉండకుండా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పని చేయాలని, రైతులతో సంబంధాలు పెంచుకోవాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పనితీరు మెరుగుపరిచేందుకు మండల వ్యవసాయ అధికారులు సహకారం అందించాలని అన్నారు. క్రాప్ బుకింగ్ సర్వే పకడ్బందీగా జరిగేలా చూడాలని అన్నారు. రైతులకు ఎక్కడ ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట అధికంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ఎక్కడా ఎరువుల కొరత లేదని, ఎక్కడైనా తప్పుడు ప్రచారాలు వస్తే వెంటనే దానిని ఖండిస్తూ సంబంధిత అధికారులు వివరణ జారీ చేయాలని అన్నారు.

జిల్లాలోని పెద్ద రైతులను, స్థానిక నాయకుల ను గుర్తించి వారికి ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పిస్తూ ఆయిల్ పామ్ పంట సాగు జరిగేలా చూడాలని అన్నారు. గత సమావేశంలో ప్రతి క్లస్టర్ కు 10 ఎకరాల ఆయిల్ పామ్ సాగు డిడి కట్టించాలని లక్ష్యం నిర్దేశించామని, దాని ప్రగతిపై కలెక్టర్ చర్చించారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తదుపరి సమావేశం నాటికి క్లస్టర్ పరిధిలో నూతనంగా 25 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు జరిగేలా డీడీలు కట్టించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం మిర్చి ధరలు తగ్గిన నేపథ్యంలో ఆ పంట స్థానంలో ఆయిల్ పామ్ సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని, ఆయిల్ పామ్ పంట సాగు వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించాలని కలెక్టర్ తెలిపారు. మన జిల్లాలో చేపట్టిన క్రాప్ బుకింగ్, రైతు బీమా, ఆయిల్ పామ్ పంట సాగు బుకింగ్ పక్కగా జరగాలని అన్నారు. జనవరి నెలలో మన జిల్లా వ్యవసాయ శాఖ పనితీరు రాష్ట్రంలోనే మొదటి మూడు స్థానాలలో ఉండే విధంగా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుత సీజన్ లో సన్న రకం వడ్లకు బోనస్ విజయవంతంగా అందించేందుకు కృషి చేసిన వ్యవసాయ విస్తరణ అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సీజన్ లో పక్కాగా దాన్యం కొనుగోలు జరిగిందని ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు రాలేదని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని సిబ్బందిపై ఉన్న నమ్మకంతోనే కొత్త కొత్త కార్యక్రమాలు చేస్తూ రైతుల జీవన పరిస్థితులు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎం.వి. మధుసూదన్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, హార్టికల్చర్ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీకి సిద్ధం.. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జనవరి 08:** ప్రభుత్వ లక్ష్యం మేరకు సంక్రాంతి లోపు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.బుధవారం పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలంలోని మల్లెమడుగు గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. మల్లెమడుగు గ్రామంలో మూడు బ్లాక్ లలో నిర్మిస్తున్న 84 ఇండ్లు, పరిసరాలను కలెక్టర్ తిరిగి క్షుణంగా పరిశీలించారు. ఇండ్ల నిర్మాణం పూర్తి దశలో ఉన్న చిన్న, చిన్న పనులను రెండు రోజులలో పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సంక్రాంతి లోపు అర్హులైన నిరుపేద లబ్దిదారులను ఎంపిక చేసి ఇండ్ల పంపిణీకి సిద్దం చేయాలని అన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్లలో నివసించే వారికి కావలసిన మౌళిక సదుపాయాలు సమకూర్చాలని అదేశించారు. మల్లెమడుగులో 84, కూసుమంచి మండలం దుబ్బ తండ లో 29, నేలకొండపల్లి మండలం ఆచార్లగూడెం లో 18, మొత్తం 131 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్ధిదారుల పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, వీటిని పేదలలో నిరుపేదలకు, అర్హులైన వారిని ఎంపిక చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో హౌజింగ్ పిడి శ్రీనివాసరావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఖమ్మం అర్బన్, రూరల్ మండల తహశీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బీజేపీ కార్యాలయంపై, కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దౌర్జన్యం అమానుషం

**బిజెపి పార్టీ జిల్లా నాయకులు కొప్పుల యాగిరెడ్డి.**



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి **బాలరాజు జనవరి 8.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల, హైదరాబాదులో బిజెపి పార్టీ ఆఫీస్ పై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ జిల్లా నాయకులు కొప్పుల యాదిరెడ్డి , మీడియాతో మాట్లాడుతూ ,పాలనలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విభజన రాజకీయాల్లో భాగంగానే హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి ప్రయత్నమని బిజెపి పార్టీ జిల్లా నాయకులు కొప్పుల యాదిరెడ్డి అన్నారు,

కాంగ్రెస్ నేతలు గుండాలతో కలిసివచ్చి రాష్ట్ర బిజెపి కార్యాలయంపై బిజెపి నేతలపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.తమ సహనాన్ని అసమర్థతగా భావించొద్దన్నారు.

## రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం.

**అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఫారూఖ్.**




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 08,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం జగన్నాధపురం లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జాతీయ రోడ్డు భద్రత మాసోస్తవాల లో భాగంగా బుధవారం అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఫారూఖ్ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు రోడ్ల పై ఎలా ప్రవర్తించాలో, పాఠశాలకు వెళ్లే సమయం లో రోడ్డు భద్రత గురించి సూచనలను అందించారు. రహదారి చిహ్నాల ప్రాముఖ్యతను తెలియజేసినారు. రోడ్డు భద్రతా జాగ్రత్తల గురించి వివరించి విద్యార్థుల కు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి బాలు ఇతర ఉపాధ్యాయులు రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు

## గుజ్జర్లపూడి చింటు ఆధ్వర్యంలో CMRF చెక్కులు అందించిన... ఎమ్మెల్యే రాగమయి దయానంద్



**తల్లాడ సీకే న్యూస్ ప్రతినిధి విజయ్ :** తల్లాడ మండలం మంగాపురం లో 6 చెక్కులను ప్రతి ఇంటి, ఇంటికి వెళ్లి CMRF చెక్కులు లబ్దిదారులకు అందించి, వారి ఆరోగ్య వివరాలు తెలుసుకొని పరామర్శించి, వారికి సీఎం అరెఫ్ ను అందచేసారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కాపా సుధాకర్ దగ్గుల రఘుపతి రెడ్డి వేమిరెడ్డి కృష్ణారెడ్డి కటికీ కిరణ్ మంగాపురం మాజీ ఉప సర్పంచ్ నరసింహారావు రామరాజు రామారావు ప్రసాద్ కృష్ణ రమేష్ ప్రేమ రాజ్ మండలం కాంగ్రెస్ నాయకులు, మహిళాలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, CMRF లబ్ధిదారులు పాల్గొన్నారు

## రూ.1.89 కోట్ల గంజాయి కాల్చివేత..



ఖమ్మం జి ల్లాలోని మూడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో 71 కేసుల్లో పట్టుబడిన 757 కేజీల గంజాయిని బుధవారం కాల్చివేశారు. కాల్చివేసిన గంజాయి విలువ రూ.1.89 కోట్లు ఉంటుందాని అంచనావేశారు. సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ జనార్థన్‌రెడ్డి అదేశాల మేరకు ఖమ్మం 2, వైరా, సింగరేణి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు నాగేందార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డిలతోపాటు అసిస్టేంట్ కమిషనర్ జి . గణేష్‌లు ఈ కాల్చివేత కార్యక్రమంలో పాల్గోన్నారు. ఈ గంజాయిని ఖమ్మం జిల్లా గోపాల్ పేట గ్రామం, తేల్లడ మండలంలోని ఉన్న ఏడబ్ల్యుఎం కన్సటింగ్ లిమిటేడ్‌లో కాల్చివేశారు.

# నాటు సార తయారీ స్థావరాలపై నర్సీపట్నం పోలీసులు దాడులు



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 08 :** జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, నమ్మకం అయిన సమాచారము తో, నర్సీపట్నం రూరల్ సర్కిల్ సీఐ ఎల్ .రేవతమ్మా ఆధ్వర్యంలో, నర్సీపట్నం పోలీస్ స్టేషన్ ఎస్సై పి.రాజారావు మరియు సిబ్బంది ఈరోజు నర్సీపట్నం మండలం ధర్మాసాగరం గ్రామ శివారులో నాటు సారా తయారీకి సంబంధించిన స్థావరాలపై నమ్మకమైన సమాచారంతో, నర్సీపట్నం రూరల్సర్కిల్ సీఐ , ఎస్ ఐ , సిబ్బంది తో మెరుపు దాడి చేయగా నాటు సారా తయారీకి ఉపయోగించే పులుపు సుమారు 6000 లీటర్ల ను ధ్వంసం చేయడం జరిగినది అదేవిధంగా నాటు సార తయారీకి ఉపయోగించే సామగ్రిని కూడా ధ్వంసం చేయడం జరిగింది. ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి ఏమనగా ఎక్కడైనా నాటుసార తయారీ గాని అమ్మకాలుగాని అక్రమంగా మద్యం అమ్మకాలు జరిగినట్లుగా అయితే పోలీస్ వారికి సమాచారం ను , సీఐ ఎన్ ఆర్ పీఎం రూరల్ సర్కిల్ 9490619497, ఎస్ ఐ – ఎన్ ఆర్ పీఎం రూరల్ పి ఎస్ 9490619496 ఫోన్ నంబర్స్ కాల్ చేయడం ద్వారా తెలపవలసిందిగా కోరుకుంటున్నాం. అదేవిధంగా ఎవరు అయిన, నాటు సార తయారీ చేసిన, అమ్మిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వన్ టౌన్ పోలీస్ వారి విజ్ఞప్తి



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 08 :** పండగ వేల అప్రమత్తంగా ఉండండి నేరం జరిగిన తర్వాత కేసులు గట్టి విచారణ చేసే.. కన్నా ..నేరాలు జరగకుండా ముందస్తు నేర నివారణ చర్యలు వన్ టౌన్ పోలీస్ వారు చేపడుతున్నారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో.. ఎవరైనా పేకాటలు గాని ..కోడిపందాలు గానీ గొర్రెపోతు పందేలు గాని గుళ్ళ ఆటలుగాని ఆడినట్లయితే వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం.ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు గాని.. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినట్లయితే 9440796019 అనే సెల్ నెంబర్ ,జీడి బాబు ఇన్స్పెక్టర్ కి ఫోన్ చేసినట్లయితే వెంటనే మీకు తగిన సహాయ సహకారాలను అందిస్తామని తెలియజేసుకుంటున్నాము.. పోలీస్ వారి సేవలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

# దశరథ్ నాయక్ కు జాతీయ గోర్ బంజారా రత్న అవార్డు...



**సికె న్యూస్ ప్రతినిధి తల్లడ:** జాతీయ గోర్ బంజారా రత్న అవార్డుకు ఎంపికైన ఎల్ హెచ్ పి ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దశరథ్ రామ నాయక్. అఖండ భారత్ బంజారా శ్రవీర్ అండ్ రైటర్ భూషణ్ అవార్డు గ్రహీత కళాకారుడు అయినా భూక్య కృష్ణ నాయక్ ద్వారా మహారాష్ట్రలోని పౌరా దేవి సంస్థ నుండి ఆల్ ఇండియా బంజారా రత్న పురస్కారానికి ఎంపిక అయ్యారు.తల్లాడ మండల కేంద్రం రంగంబంజర్ గ్రామం ధర్మిక గురువు సన్యాసి డాక్టర్ రామ్ రావు మహారాజ్ బంజారా యొక్క నాలుగో వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం సందర్భంగా సామాజిక సేవ మరియు సామాజిక సహకారం ద్వారా మీరు చేసిన విశిష్ట కృషికి గౌరవ సూచనంగా జాతీయ సన్యాసి డాక్టర్ రామరావు మహారాజ్ జాతీయ గోర్ బంజారా రత్న అవార్డు సామాజిక అభివృద్ధి సమైక్య (భారతదేశం) మీరు రెండేళ్ల 2025 కి ఎంపికయ్యారు అని తెలియజేయడం జరిగినది. బాబు సింగ్ జి మహారాజ్ ఎమ్మెల్యే లెజిస్లేటివ్ కౌన్సెలింగ్ మహారాష్ట్ర తీర్థ క్షేత్రం. పౌర క్షేత్రం మహారాష్ట్ర ఆయన పాద కమలం నుండి. 11.1.25 నా బోర్ బంజారా రత్న అవార్డును మీకు అందించటం జరుగుతుంది అని వారు తెలిపినారు.

# ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ...



**శ్రీరంగాపురం మండలం జనవరి/8 (సి కె న్యూస్ )** ఈరోజు వనపర్తి శాసనసభ్యులు తూడి. మెగా రెడ్డి జన్మదినం సందర్భంగా కంబాలపురు గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్సిల్లు ,పెన్నులు పంపిణీ చేయడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, మండల ఎస్టీ సెల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బలరాం నాయక్ , మాజీ సర్పంచ్ వెంకటయ్య యాదవ్ ,మాజీ ఉపసర్పంచ్ కృష్ణయ్య ,భాస్కర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుకోసం చేసే సేవ శాశ్వతంగా నిలిచిపోతుంది




- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు విద్యార్థులు క్రమ పద్ధతిన కృషి చేయాలి
- ఎన్ఆర్ఐ, సహారా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ల్యాప్‌టాప్ లు, సైకిల్స్ పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్

సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జనవరి -08: సమాజంలో నలుగురికి ఉపయోగపడే పనులు చేస్తూ సేవలు అందించే వారే శాశ్వతంగా నిలిచిపోతారని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం సహారా మినిస్టరీ, తానా పౌండేషన్ సహకారంతో డిస్ట్రిక్ ఎన్ఆర్ఐ పౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాలుగు లక్షల విలువ చేసే 8 ల్యాప్‌టాప్‌లు, 4 సైకిల్స్, ద్వివాంగులకు ఎలక్ట్రానిక్ ట్రై సైకిల్స్ లను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. రఘునాధపాలెం కేజీబీవి విద్యార్థులకు అవసరమైన 20వేల రూపాయిలతో సమకూర్చిన సైన్స్ ల్యాబ్ పరికరాలను కలెక్టర్ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల విద్యా అవసరాలను తీర్చేందుకు ముందుకు వచ్చిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాటలకే పరిమితం కాకుండా విద్యార్థుల శ్రేయస్సు గురించి ఆలోచించి వసతులు కల్పించడం సంతోషకరమని అన్నారు.
ఖమ్మం అంటే సేవకు ప్రతిరూపంగా దాతలు ముందుకు వస్తున్నారని కలెక్టర్ కొనియాడారు. సమాజంలో మనం చేసిన సేవే శాశ్వతంగా గుర్తుంటుందని తెలిపారు. సమాజం కోసం పనిచేసే వారికి విలువ ఉంటుందని అన్నారు. విద్యార్థులు జీవితంలో ఎదగడంతో పాటు ఇతరులకు సహాయం చేసే ఆలోచనతో ఉండాలని, మన గ్రామాలను, జిల్లాను బాగు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని, దాన్ని సాధించేందుకు చేయాల్సిన పనులు క్రమ పద్ధతి ప్రకారం పూర్తి చేయాలని అన్నారు.
ఖమ్మం జిల్లా ప్రజలు తాము ఎదుగుతూ, తోటి వారికి చేయతనిచ్చే గొప్ప మనసు కలవారని ఇలాంటి జిల్లాల్లో కలెక్టర్ గా పని చేయడం తనకు ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నానని అన్నారు.విద్యార్థులు మనతోపాటు మన స్నేహితులు కూడా బాగా చదువుకునేలా ప్రోత్సహించాలని, అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణతో చదివితేనే గొప్ప విజయాలు సాధ్యమవుతాయని కలెక్టర్ అన్నారు.అవకాశాలను అందిపుచ్చుకొని ఆయుధాలుగా మలుచుకుని అద్భుతాలను సాధించే దిశగా విద్యార్థులు ప్రయాణించాలని ఆకాంక్షించారు.
హారా మినిస్ట్రీస్, ఎన్ఆర్ఐ ఫౌండేషన్, తానా ఫౌండేషన్, రోటరీ వంటి సంస్థలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దటానికి కృషి చేస్తున్నాయని వారు అందించే సహాయాలను అందిపుచ్చుకొని లక్ష్యాలను చేదించేలా కష్టపడి మంచి జీవితంలోకి అడుగు పెట్టాలని కలెక్టర్ అన్నారు.విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని అవగాహన చేసుకుని సంస్థలు అందించే లాప్ టాప్ లను జీవితపు పురోగమనానికి ఉపయోగించుకోవాలని సూచించారు.సహారా మినిస్ట్రీస్ అధ్యక్షులు లాల్ బహుదూర్ శాస్త్రి మాట్లాడుతూ విదేశాలలో సేవలందిస్తున్న సంస్థలు స్థానికంగా తమ సంస్థ కలిసి పని చేయడం ఈ ప్రాంత విద్యార్థులకు కలిసి వచ్చే అంశమని దాతలు అందించే సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఎన్నారై ఫౌండేషన్ అధ్యక్షులు బోనాల రామకృష్ణ, కార్యదర్శి బండి నాగేశ్వరరావు, పసుమర్తి రంగారావు, కొంగర పురుషోత్తం, మునుకుంట్ల సుబ్బారావు, మానసిక శిక్షకులు రాణా ప్రతాప్ నున్న కృష్ణప్రియ, తుళ్లూరి నిర్మల, దొడ్డపనేని కృష్ణారావు, వాసిరెడ్డి అర్జున రావు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి పుట్టినరోజు వేడుకలు...

**చరిత్రకెక్కిన "మెఘా" రక్తదాన శిబిరం...**
**ఒకే రోజు 559 యూనిట్ల రక్తం సేకరణ...**
**వనపర్తి జిల్లా వ్యాప్తంగా మొట్టమొదటిసారిగా 559 యూనిట్ల సేకరణ...**



**పెబ్బేరు జనవరి/08 (సి కే న్యూస్)** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పుట్టినరోజు సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, వనపర్తి కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చీర్ల చందర్ ఆధ్వర్యంలో వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మేఘా రక్తదాన శిబిరం అట్టహాసంగా కొనసాగింది.వనపర్తి నియోజకవర్గంలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా వేలాదిగా జనం తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానాన్ని చేశారు.ఈ రక్తదాన శిబిరాలలో హైయెస్ట్ 559 యూనిట్స్ రక్తం సేకరించినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం చరిత్రలో నిలిచిపోయిందని వారు పేర్కొనడం గమనార్హం.రక్తదాన శిబిరంలో పాల్గొని రక్త దానం చేసిన వనపర్తి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పాల్గొని రక్తం దానం చేసిన దాతలు అందరికీ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు

# స్వశక్తి మహిళా సంఘాల ద్వారా 1000 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి




రాష్ట్రంలో స్వశక్తి మహిళా సంఘాలచే 1000 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు బుధవారం ప్రజా భవన్ నుంచి మంత్రులు సీతక్క, కొండ సురేఖ, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్, సెర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్, ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్ తో కలిసి మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు పై కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పెద్దపెల్లి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయని, రానున్న కొత్త విద్యుత్ పాలసీ నేపథ్యంలో ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటు లోకి తెస్తున్నామని, పెద్ద మొత్తంలో డబ్బు మహిళా సంఘాల చేతులకి వస్తున్న క్రమంలో వారు వివిధ వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని ఆదేశించారు. మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటుకు వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. మహిళా సంఘాలు ప్లాంట్ల ఏర్పాట్లు లో ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ లో ఏర్పాటుకు విద్యుత్ శాఖ రెడ్కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలో టెండర్లు ఓపెన్ చేసి వాటిని ఖరారు చేస్తారని వెల్లడించా రు. జిల్లాలలో ఆసక్తి గల మహిళా సంఘాలను గుర్తించి నిర్ధారించడం, భూ సేకరణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం వంటి పనులను గ్రామీణ అభివృద్ధి శాఖ, కలెక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఒక మెగా వాట్ ఉత్పత్తికి నాలుగు ఎకరాలు అవసరం ఉంటుందని ప్రతి జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగువేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని వివరించారు.దేవాదాయ, ఇరిగేషన్ శాఖల పరిధిలోని భూములను గుర్తించాలని, కేంద్ర అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు భూమి అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందని , అటవీ ప్రాంతాల్లో భూముల పై హక్కులు ఏర్పడినప్పటికీ స్తంభాలు వేసి విద్యుత్ లైన్ ల ద్వారా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసే క్రమంలో ఆ శాఖ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతు న్నాయని, ఆయా భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. సోలార్ విద్యుత్తు అందుబాటులోకి వస్తే అటవీ ప్రాంతాల్లోని రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ దిశగా కలెక్టర్లు పనిచేస్తే గిరిజనులు ఆత్మగౌరవంతో

బతికే అవకాశం స్పష్టంగా ఉందని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో స్మాల్, మైక్రో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నాలుగు నుంచి ఐదు ఎకరాలు భూమి అవసరం అవుతుందని, చిన్నపాటి ఇండస్ట్రియల్ ఏరియాల ఏర్పాటుకు అధికారులు భూములు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారం చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. అటవీ హక్కుల ద్వారా లభించిన భూముల్లో పంటలు సాగు చేస్తే అటవీ సంపద పెరగడంతో పాటు గిరిజనులు ఆర్థికంగా బలోపేతం అవుతారని వెల్లడించారు. రాష్ట్రంలో 6.67 లక్షల ఎకరాలను ఇప్పటివరకు ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేయగా ఆ భూముల్లో లాభసాటి పంటల సాగు జరగడంలేదని డిప్యూటీ సీఎం తెలిపారు.



# బీచ్‌లో 45 ఏళ్ల బ్యూటీ స్టన్స్



# శ్రీలీల.. అక్కడ బిగ్గెస్ట్ ఎంట్రీ ఇస్తోందిగా

యంగ్ బ్యూటీ శ్రీలీల.. వరుస సినిమాలతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. కన్నడ చిత్రంతో తెరంగేట్రం చేసిన అమ్మడు.. పెళ్లి సంద%ఙ% సినిమాతో టాలీవుడ్ కు పరిచయమైంది. ఏ ముహూర్తాన తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిందో కానీ.. వెంటనే స్టార్ హీరోల సరసన ఛాన్స్ లు సొంతం చేసుకుని లక్కీ గర్ల్ గా మారిపోయిందనే చెప్పాలి.మాస్ మహారాజా రవితేజ ధమాకా, నటసింహం బాలకృష్ణ భగవంత్ కేసరితో మంచి హిట్స్ అందుకున్న తర్వాత ఆమె నటించిన వరుస సినిమాలు నిరాశపరిచాయి. ఆ తర్వాత చిన్న గ్యాప్ తీసుకున్న అమ్మడు.. ఇప్పుడు మళ్లీ వరుసగా సినిమాలతో బిజీగా మారింది. గత సినిమాల ఫలితం ఎలా ఉన్నా.. శ్రీలీలను తీసుకోవడానికి మేకర్స్ తెగ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారని చెప్పాలి.రీసెంట్ గా పుష్ప-2 ది రూల్ మూవీలో అల్లు అర్జున్ సరసన కిస్సిక్ సాంగ్ లో చిందులేసిన శ్రీలీల.. ఓ రేంజ్ లో ప్రశంసలు అందుకుంది. గ్లామర్ స్టెప్పులేసి ప్రేక్షకులను, కుర్రాళ్లను విపరీతంగా ఆకట్టుకుందనే చెప్పాలి. ఇప్పుడు తెలుగులో అక్కినేని బ్రదర్స్ నాగచైతన్య, అఖిల్ సినిమాల్లో నటిస్తున్న ఆమె చేతిలో పవన్ ఉస్తాద్ భగత్ సింగ్ కూడా ఉంది.దాంతోపాటు హీరో శివ కార్తికేయన్ తో మూవీ చేస్తున్న శ్రీలీల.. త్వరలో కోలీవుడ్ లోకి అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. నేషనల్ అవార్డు విన్నింగ్ డైరెక్టర్ సుధ కొంగర తెరకెక్కిస్తున్న మూవీలో ఆమె నటిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ గురించి ఎప్పటి నుంచో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే.ఆ మధ్య రానా టాక్ షోకు వచ్చినప్పుడు బాలీవుడ్ ఎంట్రీ కోసం ఇన్ డైరెక్ట్ గా క్లారిటీ ఇచ్చింది శ్రీలీల. అయితే బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ తో ఆమె బీటౌన్ లోకి ఎంట్రీ ఇవ్వనున్నట్టు ఇప్పుడు జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే వరుస హిట్స్ అందుకుని కార్తీక్ ఆర్యన్ దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఆయన హీరోగా తు మేరీ మై తేరా.. మై తేరా తు మేరీ మూవీ అనౌన్స్మెంట్ వచ్చింది. బాలీవుడ్ బిగ్గెస్ట్ ప్రొడక్షన్స్ కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్ పై సమీర్ విద్వాన్స్ తెరకెక్కిస్తున్నారు. ఆ మూవీలో శ్రీలీల హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మేకర్స్ ఆ విషయాన్ని అనౌన్స్ చేయనున్నారని సమాచారం. మొత్తానికి యంగ్ బ్యూటీ.. బిగ్గెస్ట్ ప్రొడక్షన్ హౌస్ తో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తుందని నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు.

# మంత్రముగ్ధులను చేసే మృణాల్ ఠాకూర్ చిత్రాలు మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తాయి



# సమంత టాలీవుడ్ కి ఇప్పట్లో కష్టమే!



సమంత టాలీవుడ్ లో సినిమాలు చేయాలని దర్శకుడు త్రివిక్రమ్ రిక్వెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కొంత కాలంగా సమంత ముంబైలోనే ఎక్కువగా ఉండిపోవడంతో ముంబైనే కాదు అప్పుడప్పుడు హైదరాబాద్ కూడా వచ్చి తెలుగు సినిమాలు చేయాలని పబ్లిక్ గానే త్రివిక్రమ్ కోరాడు. అంత వరకూ ఏ దర్శకుడు ఆమెని తెలుగు సినిమాలు చేయమని అడగలేదు. తొలిసారి గురూజీని అడిగే సరికి సర్ ప్రైజ్ గా అనిపించింది. అయితే అప్పటికే సమంతతో గురూజీ కొన్ని సినిమాలు చేసారు.ఆమెను ఎంతో గొప్ప నటిగానూ త్రివిక్రమ్ గుర్తిస్తారు. మరి గురూజీ మాట ప్రకారం సమంత మళ్లీ తెలుగు సినిమాలు చేస్తుందా అంటే అది ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించలేదు. సమంత నటించిన %-%శాకుతలం%-, -%ఖుషీ%-% గత ఏడాది రిలీజ్ అయ్యాయి. రెండు పెద్దగా ఫలితాలు సాధించలేదు. ఆ తర్వాత అమ్మడు అమెరికా వెళ్లిపోయింది. ఏడాది పాటు అమెరికాలోనే ఉంది. ఆ తర్వాత నేరుగా అమెరికా నుంచి ముంబైకి వచ్చింది. అప్పటి నుంచి ముంబైలోనే ఉంటుంది.అప్పటికే కొన్ని హిందీ వెబ్ సిరీస్ లు...సినిమాలకు సైన్ చేసింది. ప్రస్తుతం వాటి పనుల్లోనే బిజీగా ఉంది. అప్పటి నుంచి అమ్మడు మళ్లీ హైదరాబాద్ వచ్చింది లేదు. అయితే సోషల్ మీడియాలో మాత్రం అప్పుడప్పుడు వైవిధ్య మైన పోస్టులు పెడుతూ కాస్త వివాదాస్పదంగానూ మారుతుంది. ఆ కారణంగా కొంత నెగిటివిటీని ఎదుర్కుంటుంది. ఆమె పెట్టే పోస్టులు టాలీవుడ్ లో ఓ ఇద్దర్ని ప్రత్యేకంగా టార్గెట్ చేస్తున్నాయనే ఆరోపణ వినిపిస్తుంది.

మరి ఇలాంటి సమయంలో సమంత మళ్లి తెలుగు సినిమాల వైపు చూస్తుందా అంటే నో ఛాన్స్ అనే మాట వినిపిస్తుంది. తెలుగులో ఆమె ఎరా కొంత కాలంగా సాగింది. ఆమె ఇప్పుడు తెలుగు కంటే హిందీ లోనే సంచలనం అవ్వాలనే ప్లానింగ్ తో ఉందని...తెలుగులో ఎంత పెద్ద ఆఫర్ వచ్చినా చేసే అవకాశాలు లేవనే మాట వినిపిస్తుంది.